RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి: 4 సంచిక:79

బుధవారం
మార్చి 04, 2026

పేజీలు 8
వెల: రూ.3-00



# హోలీ జోష్

## అంబరాన్నంటిన సంబరాలు

- రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టిన చిన్నాపెద్ద
- రోడ్లపై సందడి చేసిన యువత
- వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

2లో





అట్టముక్కలపై ఈసీజీ అని రాసిస్తున్న వైనం..! (ఫైల్ ఫొటో)

# రెండున్నర ఏండ్లలో ఒక్కసారి రాకపోతిరి!

### అయ్యా ఆరోగ్యశాఖ మంత్రిగారూ..

## ఎంజీఎంకి రండీ

- ఓపీ స్లిప్ పేపర్లకే దిక్కు లేదు.. ఇక వైద్యం దేవుడెరుగు..
- ఎంజీఎంపై సవతి తల్లి ప్రేమ ఎందుకు సారూ..?
- స్ట్రెచర్లు, వీల్ చైర్లు, వెంటిలేటర్లు లేక అరిగోసలు పడుతున్న రోగులు
- ఎంజీఎంను ఇప్పటికైనా గాడిలో పెట్టాలని రోగుల విజ్ఞప్తి

2లో

ఒకే బెడ్‌పై చికిత్స పొందుతున్న ఇద్దరు రోగులు (ఫైల్ ఫొటో)



**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గారూ.. మీరు ఉన్నట్టేనా? లేక ఈ వ్యవస్థను గాలికి వదిలేశారా? అంటూ ఎంజీఎంకు వచ్చే రోగులు ప్రశ్నిస్తున్నారు. ఉత్తర తెలంగాణ ప్రజలకు ఎంజీఎం ఒక ఆసుపత్రి మాత్రమే కాదు.. ప్రాణదాత. కానీ, నేడు అదే ఎంజీఎం ఆసుపత్రి, అభాగ్యుల పాలిట మృత్యుశాపంగా మారింది. ప్రభుత్వం కొలువుదీరి రెండున్నర ఏళ్లు దాటింది. మార్పు తెస్తాం.. ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ కు దీటుగా తీర్చిదిద్దుతాం అని గొప్పలు చెప్పుకున్న పాలకులు, ఇవాళ కనీసం ఒక ఓపీ స్లిప్పును కూడా రోగికి అందించలేని దయనీయ స్థితికి ఎంజీఎంను దిగజార్చారు. వెంటిలేటర్లు లేక ఊపిరి ఆగిపోతున్న రోగులు, వీల్ చైర్లు, స్ట్రెచర్లు లేక ప్రాణాలతోనే నరక యాతన అనుభవిస్తున్న బాధితులు.. గుండె పరీక్ష కోసం వస్తే మిషన్ మొరాయించింది అని వెనక్కి పంపే వైద్య సిబ్బంది.. ఇది ప్రస్తుతం ఎంజీఎం పరిస్థితి. ఏసీ గదుల్లో కూర్చుని సమీక్షలు చేస్తే ఆసుపత్రుల సమస్యలు తీరవని, ఎంజీఎంపై ఎందుకింత సవతి తల్లి ప్రేమ? అని రోగుల ఆవేదనతో అడుగుతున్నారు.

## ఇరాన్‌కు చైనా మద్దతు

### పశ్చిమాసియా ఉద్రిక్తతలపై స్పందన

- సైనిక చర్యలు తక్షణమే నిలిపివేయాలని విజ్ఞప్తి
- పలు దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు

2లో

## మినాబ్‌లో పాఠశాలపై వైమానికి దాడి

### 180 మంది మృతి..

అందులో 165 మంది బాలికలు

## నార్సింగిలో కల్వకుంట్ల కవిత అరెస్టు

- అక్రమ వెంచర్లపై ఆందోళన
- పోలీసులతో వాగ్వాదం, తోపులాట

2లో



### సంక్షేమ పథకాలు

## అర్హులందరికీ చేరాలి

- గ్రామస్థాయిలో పథకాలపై అవగాహన కల్పించాలి
- విద్య, వైద్య రంగాల్లో నిర్మాణాత్మక సంస్కరణలు
- 99 రోజుల కార్యాచరణలో సమగ్ర భాగస్వామ్యం అవసరం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో



## రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

### కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి

- ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ
- బడ్జెట్‌కు ముందు స్పష్టత కోరిన కేంద్ర మంత్రి
- ఖజానాలో నిధులు లేవని చెబుతూనే, పార్టీ అధిష్ఠానానికి వెయ్యి కోట్లు ఇస్తామనడం ఎలా సాధ్యమంటూ ప్రశ్న

2లో



వేద న్యూస్

బుధవారం | మార్చి 04, 2026

# సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరాలి

- గ్రామస్థాయిలో పథకాలపై అవగాహన కల్పించాలి
- విద్య, వైద్య రంగాల్లో నిర్మాణాత్మక సంస్కరణలు
- 99 రోజుల కార్యాచరణలో సమగ్ర భాగస్వామ్యం అవసరం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ పథకాలు నిజమైన అర్హులందరికీ ఎలాంటి మినహాయింపులు లేకుండా చేరాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కలెక్టర్ల సమావేశంలో మాట్లాడిన ఆయన, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం లక్ష్యిత లబ్ధిదారుల వద్దకు చేరడమే అధికార యంత్రాంగం ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో నిర్వహించే సమావేశాల్లో ప్రతి పథకం ద్వారా లభించే ప్రయోజనాలను ప్రజలకు స్పష్టంగా వివరించాలని సూచించారు. రేషన్ కార్డులు, సన్న బియ్యం సరఫరా, ఇందిరమ్మ ఇళ్లు, రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి కీలక పథకాల అమలుపై లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించాలని ఆదేశించారు. ప్రభుత్వ చర్యలపై ప్రజల్లో స్పష్టత ఉండేలా పారదర్శక వ్యవస్థను అమలు చేయాలని అన్నారు. లబ్ధిదారుల నుంచి వచ్చే సూచనలు, ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విద్యా రంగంలో చేపడుతున్న సంస్కరణలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల నాణ్యతను పెంచేందుకు, ఉపాధ్యాయ శిక్షణను బలోపేతం చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రులను సమీప వైద్య కళాశాలలతో అనుసంధానం చేసి మెరుగైన వైద్య సేవలు అందేలా చేయాలని ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉన్న ఆరోగ్య సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో పాల్గొనే సంస్థలకు నెలసరి బిల్లులు సమయానికి చెల్లించాలని స్పష్టం చేశారు. ఆహార నాణ్యత, పిల్లల ఆరోగ్య భద్రతపై రాజీ ఉండకూడదని అన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధులు 99 రోజుల కార్యాచరణలో చురుకుగా పాల్గొని ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. సమన్వయం, పర్యవేక్షణ, పారదర్శకత కలిసొస్తేనే సంక్షేమ కార్యక్రమాలు ఫలవంతమవుతాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

## కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి

- ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ
- బడ్జెట్‌కు ముందు స్పష్టత కోరిన కేంద్ర మంత్రి
- ఖజానాలో నిధులు లేవని చెబుతూనే, పార్టీ అధిష్ఠానానికి వెయ్యి కోట్లు ఇస్తామనడం ఎలా సాధ్యమంటూ ప్రశ్న

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ ఆర్థిక పరిస్థితికి సంబంధించి పూర్తిస్థాయి శ్వేతపత్రం విడుదల చేయాలని కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల ముందు ఆరు హామీలు, నాలుగు వందల ఇరవై హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందని చెప్పడం వెనుక ఉద్దేశ్యం ఏమిటని ప్రశ్నించారు. ఒకవైపు ఖజానాలో నిధులు లేవని చెబుతూనే, పార్టీ అధిష్ఠానం కోసం వెయ్యి కోట్లు ఇస్తామనడం ఎలా సాధ్యమవుతుందని ఆయన సందేహం వ్యక్తం చేశారు. గత పన్నెండు సంవత్సరాలుగా గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి కోసం లక్షల కోట్ల రూపాయలను ప్రాజెక్టుల రూపంలో కేటాయించిందని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కోసం కేంద్రం వడ్డీ రహిత రుణాలు అందించినప్పటికీ రాష్ట్రంలో అనుకున్న స్థాయిలో పనులు జరగలేదని విమర్శించారు. అప్పులు లేకుండా ఒక్క రోజు కూడా పాలన సాగించలేని పరిస్థితికి రాష్ట్రాన్ని తెచ్చింది ఎవరో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. 2014లో మిగులు నిధులతో ఉన్న రాష్ట్రం నేడు అప్పుల భారంలో కూరుకుపోయిందని వ్యాఖ్యానించారు. మార్చి 16న ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాలకు ముందే రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని తెలంగాణ ప్రజల తరఫున కోరుతున్నట్లు జి కిషన్ రెడ్డి తెలిపారు. ప్రజలకు పారదర్శకతతో పూర్తి వివరాలు వెల్లడించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

# నార్సింగిలో కల్వకుంట్ల కవిత అరెస్టు

- అక్రమ వెంచర్లపై ఆందోళన
- పోలీసులతో వాగ్వాదం, తోపులాట

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్టు చేశారు. నార్సింగిలోని ఒక వెంచర్ వద్ద స్థానికులతో కలిసి ఆమె ఆందోళన చేపట్టారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ వెంచర్లపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని హైడ్రాను నిలదీశారు. హైడ్రా బుల్డోజర్లను పంపించే వరకు ఆందోళన విరమించబోమని కవిత హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అక్కడికి చేరుకున్న పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కవితను పోలీసు వాహనాల్లో ఎక్కించే సమయంలో కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు, కార్యకర్తల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. కార్యకర్తలు న్యాయం కావాలని నినాదాలు చేస్తూ అక్రమ వెంచర్లను కూల్చాలని డిమాండ్ చేశారు. హైడ్రా అధికారులు రంగనాథ్ వెంటనే అక్కడికి రావాలని కోరారు. కవితతో పాటు పలువురు జాగృతి కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసే సమయంలో కవిత చేతికి స్వల్ప గాయం అయినట్లు సమాచారం. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

# రెండున్నర ఏండ్లలో ఒక్కసారి రాకపోతిరి!

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

'మంత్రి గారూ.. ఎంజీఎం ఆసుపత్రి పరిస్థితి మీకు కనిపించడం లేదా..? అసలు మీరు ఆరోగ్యశాఖను నిర్వహిస్తున్నట్టేనా.. లేక మీ పర్యవేక్షణ గాలికి వదిలేశారా?' ఈ ప్రశ్నలు ఇప్పుడు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి వెళ్తున్న ప్రతి సామాన్యుడి గొంతులోంచి వినిపిస్తున్నాయి. రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన ఎంజీఎం ఆసుపత్రిని నిర్లక్ష్యం చేస్తున్న తీరు చూస్తుంటే, ఆరోగ్యశాఖ మంత్రికి దీనిపై ఎందుకింత సవతి తల్లి ప్రేమో అర్థం కావడం లేదు. ప్రభుత్వం కొలువుదీరి రెండున్నర ఏళ్లు దాటింది. కానీ, బాధ్యతాయుతమైన మంత్రిగా ఆయన కనీసం ఒక్కసారి కూడా ఈ ఆసుపత్రి సమస్యలపై దృష్టి పెట్టకపోవడం, క్షేత్రస్థాయిలో రోగులు పడుతున్న నరక యాతనను పట్టించుకోకపోవడం ఆయన పని తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

### అయ్యా ఆరోగ్యశాఖ మంత్రిగారూ.. ఎంజీఎంకి రండి

- ఓపీ స్లిప్ పేపర్లకే దిక్కు లేదు.. ఇక వైద్యం దేవుడెరుగు..
- ఎంజీఎంపై సవతి తల్లి ప్రేమ ఎందుకు సారూ..?
- స్ట్రక్చర్లు, వీల్ చైర్లు, వెంటిలేటర్లు లేక అరిగోసలు పడుతున్న రోగులు
- ఎంజీఎంను ఇప్పటికైనా గాడిలో పెట్టాలని రోగుల విజ్ఞప్తి

### మంత్రికి మాత్రం చిన్న చూపు..

ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజల ఆరోగ్య అవసరాలకు ఎంజీఎం ఆసుపత్రి పెద్ద దిక్కు.. నిత్యం వందలాది మంది పేద రోగులు ప్రాణాలను కాపాడుకునేందుకు ఇక్కడికి వస్తుంటారు. ఒకప్పుడు భరోసానిచ్చిన ఈ వైద్య సంస్థ, నేడు సరైన పరికరాలు లేక అస్తవ్యస్తంగా తయారైంది. మంత్రి పాలనలో ఆధునిక వైద్యం మాట దేవుడెరుగు.. కనీసం ప్రాథమిక సౌకర్యాలు లేక రోగులు అలమటిస్తున్నారు. నిధులు కేటాయించడంలో మంత్రి జాప్యం, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపం వల్ల ఆసుపత్రి వ్యవస్థ కుప్పకూలింది. మంత్రి ఏసీ గదుల్లో కూర్చుని సమీక్షలు చేయడం తప్ప, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగుల గోడు వినే తీరిక ఆయనకు లేదని రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### అత్యవసర విభాగంలో నిర్లక్ష్యం..



ఎంజీఎం అత్యవసర విభాగం పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. వెంటిలేటర్లు కరువై రోగులు అల్లాడుతుంటే, మంత్రి మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి వెంటిలేటర్ దొరకక ఇతర ఆసుపత్రులకు తరలించేలోపు ప్రాణాపాయ స్థితి ఏర్పడుతోంది. ఒక ఆరోగ్యశాఖ మంత్రిగా కనీసం ప్రాణాలను రక్షించే ప్రాథమిక పరికరాలను కూడా సమకూర్చలేని స్థితిలో ఉన్నారా? ప్రభుత్వ ఆసుపత్రులను బాగు చేస్తామన్న హామీలు ఏమయ్యాయి? అని ఎంజీఎంకు వచ్చే రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వీల్ చైర్ పై కూర్చోబెట్టి సెలైన్ ఎక్కిస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)



(ఫైల్ ఫొటో)



పేపర్ బండిళ్ల కొరతతో ఓపీ చిట్టీలను సగం కట్ చేసి ఇస్తున్న పరిస్థితి (ఫైల్ ఫొటో)

### ఓపీ స్లిప్పుల నుంచి ఈసీజీ వరకు..

ఆసుపత్రిలో సమస్యలు కేవలం వెంటిలేటర్లకే పరిమితం కాలేదు. గుండె సంబంధిత రోగులకు ఈసీజీ మిషన్లు మొరాయిస్తుంటే, నడవలేని రోగులను మోసుకెళ్లడానికి కనీసం వీల్ చైర్లు, స్ట్రక్చర్లు లేని దుస్థితి. బీపీ పరికరాలు లేక, కనీసం ఓపీ స్లిప్పులు కూడా అందించలేని స్థితిలో ఉంది. ప్రభుత్వ ఆసుపత్రి ఈ స్థాయికి దిగజార్చినా మంత్రి మాత్రం ఏ మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రభుత్వ ఆసుపత్రుల తీరు మారుస్తాం అని గొప్పలు చెప్పుకున్న మంత్రి రెండున్నర ఏళ్లలో ఏం మార్చారు? కనీసం ఓపీ స్లిప్ పేపర్లు కూడా కొనలేని ప్రభుత్వం, ఇక పేదలకు వైద్యం ఏంచేస్తుందని రోగులు అంటున్నారు.

### మంత్రి గారూ.. ఇకనైనా స్పందిస్తారా?

ఎంజీఎం ఆసుపత్రిని కేవలం ఒక భవనంగా కాకుండా, లక్షలాది మంది ప్రాణాలను కాపాడే జీవనాడిగా చూడాలని, ప్రభుత్వం ఏర్పడి రెండున్నర ఏళ్లు గడిచినా, ప్రభుత్వ ఆసుపత్రుల దుస్థితి మారలేదంటే దానికి పూర్తి బాధ్యత ఆరోగ్యశాఖ మంత్రిదే. ఇప్పటికైనా నిద్ర లేచి, క్షేత్ర స్థాయిలో పర్యటించాలని ప్రజలు రోగులు కోరుతున్నారు.

# హోలీ జోష్

### అంబరాన్నంటిన సంబరాలు

- రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టిన చిన్నాపెద్ద
- రోడ్లపై సందడి చేసిన యువత
- వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు





**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

రాష్ట్రమంతటా రంగుల పండుగ హోలీ సంబరాలు మిన్నంటాయి. వాన చినుకుల్లా రంగుల జల్లులు కురుస్తుంటే, వాడవాడలా ప్రజలందరూ ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. అందరూ ఒకరికొకరు రంగులు పూసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ పండుగ జోష్ ఫుల్ గా కనిపించింది. హోలీ పండుగంటేనే చిన్నారులకు పండగ. తెల్లవారుజాము నుంచే రంగుల గన్స్ పట్టుకుని, తమ స్నేహితులతో కలిసి వీధుల్లో సందడి చేశారు. ఒకరి ముఖంపై ఒకరు రంగులు చల్లుకుంటూ, ఆ రంగుల ప్రపంచంలో వారు చేస్తున్న కేరింతలు పండుగ ఉత్సాహాన్ని రెట్టింపు చేశాయి. తమ ప్రియమైన వారిని రంగులతో ముంచెత్తుతూ, అమాయకపు నవ్వులతో చిన్నారులు చేసిన అల్లరి అందరినీ అలరించింది.


### రోడ్లపై యువత జోష్.. హోరెత్తిన వీధులు

రోడ్లపై యువత హంగామా చెప్పనలవి కాదు. డీజే సౌండ్లకు అనుగుణంగా, హోలీ పాటలకు స్టెప్పులేస్తూ యువత హోరెత్తించారు. గుంపులు గుంపులుగా రోడ్లపైకి వచ్చి, రంగుల హోలీ ఆడుతూ ఆనందంలో మునిగిపోయారు. వాహనాల్లో వెళ్లే వారిని కూడా ఆపి రంగులు పూస్తూ, అందరినీ తమ ఆనందంలో భాగస్వాములను చేసుకున్నారు. ఈ రంగుల వేడుకలో రాజకీయ ప్రముఖులు, సినీ తారలు కూడా ఏమాత్రం తగ్గలేదు. తమ నివాసాల వద్దే కాకుండా, బహిరంగ వేదికలపై కూడా అభిమానులతో, కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా హోలీ ఆడారు. సెలబ్రిటీలు తమ కుటుంబ సభ్యులతో కలిసి రంగులు పులుముకుంటూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రముఖుల రాకతో అభిమానుల్లో మరింత ఉత్సాహం నిండింది. కులం, మతం, ప్రాంతం అనే తేడాలేమీ లేకుండా, అందరూ రంగుల ప్రపంచంలో కలిసిపోయిన ఈ రోజు, రాష్ట్ర ప్రజల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. శాంతికి, సమానత్వానికి ప్రతీకగా నిలిచిన ఈ హోలీ వేడుకలు, రాష్ట్ర ప్రజలకు మధుర జ్ఞాపకాలను

# మానవీయ కోణంలో పాలన సాగించాలి

**వేద న్యూస్, హైదరాబాద్**

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కలెక్టర్లు ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన జోగులాంబ గద్వాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ తదితర జిల్లాల కలెక్టర్లు నేడు సచివాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గౌరవ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని, ప్రజలతో మమేకం కావాలని ఆయన సూచించారు. జిల్లాల్లో పాలన ప్రజాకేంద్రంగా సాగాలని, ప్రజలకు మేలు చేసే నిర్ణయాలకే ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఐఏఎస్ అధికారుల కెరీర్‌లో జిల్లా కలెక్టర్లుగా పని చేయడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు ఉండే ఈ బాధ్యతల ద్వారా క్షేత్ర స్థాయిలో సమస్యలపై అవగాహన పెరుగుతుందని, జిల్లాల్లో పనిచేసిన అనుభవం భవిష్యత్తులో ఉన్నత బాధ్యతల్లో ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాల్సిన బృహత్తర బాధ్యత కలెక్టర్లదేనని స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సాగాలని, పారదర్శకత, సమర్థతతో సేవలు అందించాలని దిశానిర్దేశం చేశారు.

# మినాబ్‌లో పాఠశాలపై వైమానికి దాడి

## 180 మంది మృతి.. అందులో 165

**వేద న్యూస్, డెస్క్**

అమెరికా–ఇజ్రాయెల్ వైమానిక దాడుల నేపథ్యంలో ఇరాన్‌లోని మినాబ్ ప్రాంతంలో చోటుచేసుకున్న విషాద ఘటన ప్రపంచాన్ని కలచివేసింది. అక్కడి ఓ పాఠశాలపై దాడి జరగడంతో మొత్తం 180 మంది మృతిచెందినట్లు సమాచారం. ఇందులో 165 మంది బాలికలే ఉన్నట్లు ఇరాన్ అధికారులు వెల్లడించారు. మృతులందరినీ ఒకేచోట సమాధి చేసినట్లు సమాచారం. ఇందుకోసం పెద్ద సంఖ్యలో గోతులు తవ్విన దృశ్యాలను ఇరాన్ మంత్రి అబ్బాస్ విడుదల చేసినట్లు వార్తలు వచ్చాయి. ఈ ఘటన దేశవ్యాప్తంగా ఆవేదన కలిగించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర ప్రతిస్పందనలు రేకెత్తిస్తోంది. పిల్లలపై జరిగిన ఈ దాడిని ఇరాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. నిరపరాధుల ప్రాణనష్టంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. సంఘటనపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.మినాబ్ ఘటనతో ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. శాంతి చర్చలే సమస్యకు పరిష్కారమని, నిరపరాధుల ప్రాణాలను కాపాడేందుకు అంతర్జాతీయ సమాజం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# ఇరాన్‌కు చైనా మద్దతు

## పశ్చిమాసియా ఉద్రిక్తతలపై స్పందన

ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలపై చైనా స్పందించింది. పశ్చిమాసియా పరిస్థితులు తీవ్రంగా మారుతున్న వేళ చైనా ఇరాన్‌కు మద్దతుగా నిలిచింది. ఈ మేరకు చైనా విదేశాంగ మంత్రి ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చితో దూరవాణి సంభాషణ నిర్వహించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులను తక్షణమే నిలిపివేయాలని ఆయన కోరారు. ఇరాన్ తన సార్వభౌమత్వం, భద్రత, ప్రాదేశిక సమగ్రత, జాతీయ గౌరవాన్ని కాపాడుకునే హక్కు కలిగి ఉందని వాంగ్ యి పేర్కొన్నారు. చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలను రక్షించుకునే పోరాటానికి చైనా మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితులు మరింత తీవ్రతరం కాకుండా అమెరికా, ఇజ్రాయెల్ సైనిక చర్యలను నిలిపివేయాలని సూచించారు. ఇక మరోవైపు ఇరాన్ దాడులను విస్తృతం చేసినట్లు సమాచారం. సౌదీ అరేబియాలోని అమెరికా రాయబార కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని డ్రోన్లతో దాడి చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇరాక్‌లో పేలుళ్లు సంభవించగా, బహ్రెయిన్‌లో హెచ్చరిక సైరన్‌లు మోగాయి.

వేద న్యూస్

బుధవారం మార్చి 04, 2026

# చికిత్స పొందుతూ మహిళ మృతి



**వేద న్యూస్, పాపన్నపేట :**

పురుగు మందు తాగి చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం...గ్రామానికి చెందిన జిన్న దుర్గాభవాని(24) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. తరచూ అనారోగ్య విషయమై ఇంట్లో బాధప డుతూ ఉండేది.గత నెల 27న రాతి వేళ ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగు మందు తాగింది.ఈ క్రమంలో కుటుంబీకులు గమనించి చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా హాస్పిటల్ కు తరలించారు.అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ హాస్పిటల్ కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది.మృతురాలి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

**వేద న్యూస్, రుద్రూర్ :**



హోలీ పండుగను పురస్కరిం చుకొని రుద్రూర్ మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో వీడిసి అధ్యక్షులు పట్ల సురేష్ ఆధ్వర్యం లో మంగళవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. హోలీ పండుగ అయిన మరుసటి రోజు కుస్తీ పోటీలు నిర్వహించడం ఆనవా యితీగా వస్తుంది. ఈ కుస్తీ పోటీలో గెలుపొందిన మల్లాయో ధులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, మాజీ సర్పంచ్ బాపూజీ లింగం, మాజీ జెడ్పిటీసి నారోజి గంగారాం, కుర్మాజీ సాయిలు, దవోజి సాయిలు, దత్తు స్వామి, రమేష్, సురేందర్, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హోళీ సంబరాలు



**వేద న్యూస్, రుద్రూర్ :**

హోలీ పండుగను పురస్కరించుకొని రుద్రూర్ మండల కేంద్రంలో మంగళవారం హోలీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, గ్రామ పంచాయతీ కార్మికులు ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, యువకులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# శివకళ్యాణోత్సవాల ఏర్పాట్లపై ఈవో సమీక్ష



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

**- పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి ఆదేశం**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న స్వామివారి శివకళ్యాణోత్సవాల ఏర్పాట్లను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రమాదేవి ఇంజనీరింగ్ విభాగం అధికారులు, అర్చకులు, ఉద్యోగులు మరియు సంబంధిత సిబ్బందితో తన చాంబర్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉత్సవాల సమయంలో భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఈవో ఆదేశించారు. దర్శన ఏర్పాట్లు, పార్కింగ్ సదుపాయం, తాగునీరు, పారిశు ధ్యం, విద్యుత్ సరఫరా, భద్రతా చర్యలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శివకళ్యాణోత్సవాలు భక్తుల ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని మరింత పెంపొందించేలా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఈవో రమాదేవి పేర్కొన్నారు.

# వీధి కుక్కల దాడి..

**- 25 మందికి గాయాలు**



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడ పట్టణంలో వీధి కుక్కల స్వైర విహారం స్థానికులను భయాం దోళనలకు గురిచేసింది. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉద యం వరకు జరిగిన ఘటనల్లో సుమారు 25 మందికి పైగా గాయపడ్డారు. 22వ వార్డు పరిధిలోని బద్దిపోచమ్మ వీధి, అర్బన్ కాలనీ, సుభాష్ నగర్, ధోబీఘాట్, మార్కెట్ ప్రాంతాల్లో కుక్కల దాడులు ఎక్కువగా చోటుచేసుకున్నాయి. కుక్కకాటుకు గురైన వారు సమీప ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారిని 22వ వార్డు కౌన్సిలర్ ఇప్పపుల మమత అజయ్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ విషయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు తెలియజేశారు. పట్టణంలో వీధి కుక్కల సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానికులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

# చెడుపై మంచి సాధించిన విజయానికి సూచనే హోలీ

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**- ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ లో ఘనంగా వేడుకలు**

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



రంగుల పండుగగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే హోలీ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన హోలీ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హోలీ పండుగ మన సంస్కృతిలో ఐక్యత, సౌభ్రాతృత్వం, ఆనందాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. చెడుపై మంచి గెలుపును సూచించే ఈ పర్వదినం ప్రతి కుటుంబంలో సుఖశాంతులు నింపాలని ఆకాంక్షించారు. రంగులతో ఒకరినొకరు ఆహ్వానించుకుంటూ స్నేహభావాన్ని పంచుకునే ఈ వేడుక సమాజంలో సామరస్యాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. హోలీకి ముందు రోజు జరుపుకునే హోలికా దహనం, మన ప్రాంతంలో కామదహనం రూపంలో కొనసాగుతున్న ఆనవాయితీ అని వివరించారు. ప్రజలు సురక్షితంగా, పర్యావరణహితంగా హోలీ వేడుకలను జరుపుకోవాలని సూచించారు.

# వృద్ధులకు టోపీల పంపిణీ

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



వరంగల్ రామన్నపేట లోని డాక్టర్. ఏ. రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చంద్రగ్రహణం విడిచినంతలో భాగంగా అలాగే వేసవికాలంలో రోడ్లపై కూరగాయలు, పండ్లు,తిను బండారాలు అలాగే వివిధ రకాల రోజువారి వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్న వారికి ఎండాకాలంలో రక్షణగా ఉండడానికి గాను మానవతా దృక్పథంతో ఉచితంగా 20 మందికి టోపీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ ఏ .రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వృద్ధులు మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లకుండా ఉండడం శ్రేయస్కరమని అన్నారు. ఎండాకాలం చెమట ఎక్కువగా వస్తుంది కావున నీరు ఎక్కువ మోతాదులో తీసుకొని త్రాగడం చాలా మంచిది. ముఖ్యంగా బయటి ఆహారం ఏమి తినకుండా ఉండటం చాలా మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టి డాక్టర్. ఏ. రాజేంద్రప్రసాద్ తోపాటు ఆర్గనైజర్ శ్రవణ్, సభ్యులు రామ శ్రీనివాస్, రాజేష్, శైలజ , వీరనారాయణ స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కొమ్మాల జాతరకు ప్రభ బండ్ల పయనం

**వేద న్యూస్,నల్లబెల్లి :**

కొమ్మల జాతరకు ప్రభ బండ్ల పయనం వరంగల్ జిల్లాలో హోలీ వేడుకలంటే ముందుగా గుర్తొచ్చేది కొమ్మాల జాతరే. కొమ్మాల జాతర ప్రభ బండ్లకు ప్రసిద్ధి. నాడు భక్తులు మొక్కుల రూపంలో ప్రభలను తీసుకెళ్లేవారు.కానీ కాల క్రమేణా ఇవి రాజకీయ పోటీల వేదికలుగా మారిపోయాయి.గ్రామాలనుంచి జాతర దాకా రహదారులన్నీ ప్రభ బండ్ల సందడితో నిండను న్నాయి.ఈ నేపథ్యంలో నల్లబెల్లి మండలంలోని గ్రామాల్లో కొద్ది సేపట్లో జాతరకై బండ్లు బయలుదేరేందుకు సిద్ధమయ్యాయి. ప్రతి గ్రామం తన ప్రభ బండ్లను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు పెద్ద ఎత్తున ఖర్చు పెట్టింది .కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ప్రతిష్టను నిలబెట్టేందుకు పోటీగా ప్రభ బండ్లను అలంకరిం చాయి.ఎవరూ ఎవరికీ తగ్గకుండా పోటీపడటం వల్ల జాతర రూట్లంతా సందడి వాతావరణమైంది. భక్తిరాజకీయ రంగుల మేళవింపుతో ఈసారి ప్రభ బండ్ల ప్రదర్శన మరింత రుచికరంగా మారనుంది.బండ్ల అలం కరణల నుంచి శబ్ద వ్యవస్థల వరకు ప్రతి అంశం ప్రత్యేక శ్రద్ధతో సిద్ధమైంది. ప్రభల ప్రతిష్టను పెంచేందుకు యువత పెద్ద సంఖ్యలో ముందుకొచ్చింది. ప్రతి గ్రామ ప్రభ బండ్లు తీసుకొని 'మా గ్రామం ముందు' అన్న భావనతో ప్రజలు కదిలారు. అయితే, భారీ జనసందోహాన్ని దృష్టిలో పెట్టుకొని పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. జాతర మార్గాల్లో ప్రత్యేక పర్యవేక్షణకు బలగాలను మోహరించారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా హెచ్చరికలు, సూచనలు జారీ చేశారు.ప్రభ బండ్ల ప్రదర్శనలో శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రత్యేక మార్గదర్శకాలు అమల్లోకి తెచ్చారు. యువత ఉత్సాహంతో బాధ్యతాయుతం గా వ్యవహరించాలని పోలీసులు కోరారు. ఆదినుంచి రాజకీయ వేడి కేంద్రంగా నిలిచే నల్లబెల్లి, ఈసారి కూడా అదే ఉత్సాహాన్ని చూపించేందుకు సిద్ధమైంది.ప్రభ బండ్ల పోటీలో రాజకీయ పార్టీల మధ్య ఉత్కంఠ స్పష్టంగా కనిపించింది.మొత్తంగా ప్రాంతం అంతటా పండుగ వాతావరణం నెలకొంది. భక్తి, ఆనందం, రాజకీయ పోటీ మూడూ కలసి కొమ్మాల జాతరను మరింత వైభవవంతం చేయనున్నాయి.



ప్రాంత ప్రజలు భారీగా పాల్గొనేలా ఏర్పాట్లు పూర్తయ్యాయి. కొమ్మాల జాతర సందడి ఇప్పటికే ప్రారంభమై, నల్లబెల్లి ప్రాంతం పండుగ కాంతులతో కళకళలాడుతోంది.

# ఘనంగా హోళీ సంబరాలు

**వేద న్యూస్, పాపన్నపేట :**



హోలీ పండుగను పురస్కరించుకొని పాపన్న పేట మండల కేంద్రంలో మంగళవారం హోలీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, యువకులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో చొప్పదండి వాసి విజయ్ మృతి

**వేద న్యూస్, చొప్పదండి:**



చొప్పదండి పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన గుండేటి విజయ్ ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో వ్యక్తిగత పనిమీద బైక్‌పై వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆయనను నిమ్స్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విజయ్ మృతితో ఇందిరానగర్ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# అంబరాన్నంటిన హోలీ సంబరాలు

**- బోయినిపల్లి మండలంలో ఘనంగా వేడుకలు**



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల వ్యాప్తంగా మంగళవారం హోలీ పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రజలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచే మండలంలోని పలు గ్రామాల్లో యువకులు, పెద్దలు, చిన్నారులు గుంపులుగా చేరి కేరింతలు కొడుతూ రంగులతో హోలీ ఆడారు. రంగుల జల్లులతో గ్రామ వీధులు కళకళలాడాయి. ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ స్నేహభావాన్ని పంచుకున్నారు. పండుగ సందర్భంగా ఎక్కడ చూసినా ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. గ్రామాల్లో యువత డీజే సౌండ్ సిస్టమ్‌లతో సందడి చేశారు. బోయినిపల్లి మండలంలో హోలీ వేడుకలు శాంతియుతంగా, ఉత్సాహంగా నిర్వహించుకున్నారు.

వేద న్యూస్

బుధవారం మార్చి 04, 2026

# అంబరాన్నంటిన హోళీ సంబరాలు..!



**వేద న్యూస్, పరకాల :**

వసంత కాలం రాకతో ప్రకృతి పులకిస్తుంటే, రంగుల పండుగ హోళీ మిత్రుల మధ్య సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. పరకాల పట్టణంలో కులమతాలకు అతీతంగా, చిన్నా పెద్దా తేడా లేకుండా మిత్రులందరూ ఒకచోట చేరి రంగుల కేళిలో మునిగితేలారు. ఉదయం నుంచే మిత్రులందరూ కలుసుకొని 'హోళీ శుభాకాంక్షలు' తెలుపుకుంటూ పండుగను ప్రారంభించారు. ప్రకృతికి హాని చేయని సహజసిద్ధమైన రంగులను వాడుతూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు."చదువు, ఉద్యోగాలు, ఇతర వృతుల బిజీలో పడి తరచుగా కలుసుకోలేకపోతున్నాం. కానీ ఈ హోళీ పండుగ మమ్మల్ని మళ్ళీ చిన్ననాటి మిత్రులుగా మార్చేసింది. ఈ రంగుల పండుగ మా జీవితాల్లో సరికొత్త రంగులను నింపింది." అని మిత్ర బృంద సభ్యులు తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఎరుపు, పసుపు, నీలం.. ఇలా రంగు రంగుల ముఖాలతో గుర్తుపట్టలేనంతగా మారిన మిత్రులు, ఆఖరికి గ్రూప్ ఫోటోలు దిగి ఈ మధుర స్మృతులను సెల్ ఫోన్ లలో బంధించుకున్నారు. ఈ వేడుక కేవలం రంగుల పండుగగానే కాకుండా, స్నేహానికి చిహ్నంగా నిలిచిపోయిందని భావించారు. ఈ వేడుకల్లో నాగేళ్లి సురేష్, బొచ్చు కైలాస్, రాజు సికిందర్ , చదిరిక శ్రీనివాస్ ముదిరాజ్, మంతెన సంతోష్ నేత, గాదె భాస్కర్, కొగిల చంద్రమౌళి, దామెర రాజేందర్ ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

# ఘనంగా హోలీ వేడుకలు



**వేద న్యూస్ , జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని బిసిఐటి కళాశాలలో మంగళవారం హోలీ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు ఈ వేడుకలలో ఎంతో సంతోషంగా పాల్గొన్నారు. రంగులు పూసుకుని హోలీ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ... అత్యంత ఘనంగా ఉత్సవాలు నిర్వహించుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా అత్యంత వైభవోపేతంగా హోలీ సంబరాలను నిర్వహించుకుంటారని ఈ సందర్భంగా బీసీఐటి వారు పేర్కొన్నారు.

# సదాశివపురంలో కూరగాయల పంపిణీ



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం సదాశివపురం గ్రామంలో అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు కూరగాయల పంపిణీ చేయడం జరిగింది. ఇప్పటివరకు 2 వేదికల మీద కూరగాయల పంపిణీ కార్యక్రమం జరిగినట్లు అభిమానుల సంఘ సభ్యులు తెలిపారు.సదాశివపురం ఉప సర్పంచ్ నాగెల్లి పుల్లమ్మ భర్త నాగెల్లి సైదులు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తి హాజరయ్యారు. అపర మేధావి దివ్యమూర్తి మాట్లాడుతూ సహాయం చేయాలనే ఆలోచన ప్రతి ఒక్క వ్యక్తికి రావాలని, సహృదయ భావాన్ని ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని సమాజంలో ఎవరు వంతుగా వారు తమకు తోచిన విధంగా ఇతరులకు సహాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగెల్లి పుల్లమ్మ చిర్రా బిక్షం, సదాశిపురం గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# రైలు ఢీ కొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి

**వేద న్యూస్ మారేడ్‌పల్లి:**

పట్టాల పక్కన నుంచి నడుచుకుంటూ వెళ్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..డబిల్‌పూర్-మనోహరాబాద్ రైల్వే స్టేషన్ల మధ్యన మంగళవారం ఉదయం రైల్వే ట్రాక్ పక్కన నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి కుడి చేతి పై అమ్మ అని పచ్చ బొట్టు ఉందని పోలీసులు తెలిపారు. మృతుడి వయసు సుమారు 20-25 సంవత్సరాలు ఉంటాయని పోలీసులు చెప్పారు. మృతుడి సంబంధీకులు ఏవరైనా ఉంటే సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

# ఘనంగా హోలీ సంబరాలు



**వేద న్యూస్, పెద్ద శంకరంపేట :**

పెద్ద శంకరంపేట మండల కేంద్రంలో మంగళవారం హోలీ పండుగ సందర్భంగా గ్రామం రంగుల హరివిల్లుగా మారింది. పండుగ సందర్భంగా చిన్నా పెద్దా తేడా లేకుండా గ్రామస్తులంతా ఒక్కటై ఉత్సాహం గా వేడుకలు జరుపుకున్నారు. ఉదయం నుంచే వీధులన్నీ రంగుల కాంతులతో కళకళలాడాయి.హోలీ అనేది చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతం. మనసులోని ద్వేషాలు, విభేదాలు దూరం చేసి ప్రేమాభిమానాలు పంచుకునే పవిత్ర పండుగగా పెద్దలు వివరించారు. ఈ సందర్భంగా పిల్లలు రంగులతో సందడి చేయగా, యువత నృత్యాలతో ఆకట్టుకున్నారు. మహిళలు పరస్పరం తిలకాలు పెట్టుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ ప్రధాన వీధుల్లో ఆనంద కేరింతలు మారుమోగాయి. హోలీ పండుగ ద్వారా ఐకమత్యం, సౌభ్రాతృత్వం పెంపొందుతుందని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు.

# దివ్యాంగుల పెన్షన్ పెంచాలి

- బడ్జెట్లో వారి సంక్షేమానికి ఐదు శాతం కేటాయించాలి
- బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో దివ్యాంగుల సంక్షేమానికి ఐదు శాతం నిధులు కేటాయించాలని, పెన్షన్ రూ.6 వేలకు పెంచి వెంటనే అమలచేయాలని బీఎస్పీ నేలకొండపల్లి మండల ప్రధానకార్యదర్శి బొడ్డు బాబురావు ఒక ప్రకటనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో దివ్యాగుల సంక్షేమానికి రూ.1669.72 కోట్లు మాత్రమే కేటాయించటం దుర్మార్గమని మండిపడ్డారు. నిధుల కేటాయింపుల విషయంలో కేంద్రం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఆయన ఖండించారు. 2026.27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్లో దివ్యాంగుల సంక్షేమానికి నిధుల కేటాయింపు పెంచాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చేయూత పెన్షన్స్ పెంపు కోసం బడ్జెట్లో నిధులు కేటాయించి, పెన్షన్స్ పెంచాలని డిమాండ్ చేశారు. రాష్టంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 26 నెలలు పూర్తవుతున్న పెన్షన్స్ పెంచకపోవటం సిగ్గు చేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు సహాయ పరికరాల పంపిణి కోసం లబ్దిదారుల జాబితాలు తయారు అయ్యాయని ఎందుకు పరికరాలు పంపిణి చేయడం లేదని బొడ్డు బాబురావు ప్రశ్నించారు.

**బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలంటు డిమాండ్**

2024--25 ఆర్థిక సంవత్సరానికి చెందిన పరికరాలు పూర్తిస్థాయిలో పంపిణి చేయకుండానే 2025--26 ఆర్థిక సంవత్సరానికి దరఖాస్తులు స్వీకరించడం సరైంది కాదని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను గుర్తించి వెంటనే భర్తీ చేయాలని, అర్హులైన వారికి ఖచ్చితంగా ఇండ్లు మంజూరి చేయాలని డిమాండ్ చేశారు. విబి--జీ రామ్ జీ బిల్లు రద్దుచేసి చట్టాన్ని సక్రమంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వికలాంగులపై దాడులు, దౌర్జన్యాలు, వేధింపులు పెరిగిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తూ సమస్యల పరిష్కారం కోసం దివ్యాంగ్యులందరూ ఏకతాటి పైకి రావాలని పిలుపు నిచ్చారు.

# హోలీ హంగామా..

- బ్రదర్స్ టీమ్ ఆధ్వర్యంలో జమ్మికుంట కాలేజీ గ్రౌండ్‌లో..
- రేన్ డాన్స్, లైవ్ డీజేతో రంగుల సందడి





**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని కాలేజీ గ్రౌండ్‌లో బ్రదర్స్ టీం ఆధ్వర్యంలో నిర్వహించిన హోలీ ఫెస్టివల్ హంగామా కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు దిలీప్, జమ్మికుంట సీఐ రామకృష్ణ గౌడ్ విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు యువతకు హోలీ పండుగను ఆనందంగా, కానీ బాధ్యతతో జరుపుకోవాలని సూచించారు.పట్టణం మరియు పరిసర ప్రాంతాల నుంచి యువతీ యువకులు కుటుంబ సమేతంగా భారీ సంఖ్యలో సుమారు 700 మంది పాల్గొని రేన్ డాన్స్, లైవ్ డీజే సంగీతంతో రంగుల జల్లుల్లో సందడి చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.బ్రదర్స్ టీం నిర్వాహకులు పాల్గొన్న వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు సమకూర్చడంతో కార్యక్రమం సజావుగా సాగింది. హోలీ పండుగ ఉత్సాహం, ఐక్యత, స్నేహభావాన్ని ప్రతిబింబించేలా ఈ వేడుక నిలిచింది.

# ఘనంగా ఖమ్మం ప్రెస్ క్లబ్ 24వ వార్షికోత్సవం

- జర్నలిస్టుల ఐక్యతకు ప్రతీక
- యూనియన్లకు అతీతంగా వేడుక




**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం ప్రెస్ క్లబ్ 24వ వార్షికోత్సవ వేడుకలు మంగళ వారం ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఘనంగా నిర్వహించబడ్డాయి. జిల్లాలోని వివిధ జర్నలిస్టు యూనియన్లకు చెందిన సీనియర్, జూనియర్ విలేకరులు, జర్నలిస్టు నేతలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తొలుత ప్రెస్ క్లబ్ వ్యవస్థాపక నిర్వాహకులు, సీనియర్ జర్నలిస్ట్ మోత్కూరి వెంకటేశ్వర్లును స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంతోటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పుష్పాంజలి ఘటించి, నివాళులు అర్పించారు. ఈ వేడుకల సందర్భంగా 5 కిలోల భారీ కేక్‌ను కట్ చేసి జర్నలిస్ట్ లకు పంచిపెట్టారు. స్నేహసౌహార్ద వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం ప్రెస్ క్లబ్ కుటుంబస్ఫూర్తిని ప్రతిబింబించింది. 24 ఏళ్ల ప్రస్థానంలో ప్రెస్ క్లబ్ సాధించిన విజయాలను స్మరించుకుంటూ, సీనియర్ జర్నలిస్టుల సేవలను గుర్తు చేసుకున్నారు. సభలో ఐజేయు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నామ పురుషోత్తం, టీజేఎఫ్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, టిడబ్ల్యూజేఎఫ్ ప్రెస్ క్లబ్ (హెచ్-2843) అధ్యక్షుడు అంతోటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మల్లెల శిల్ప తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ప్రెస్ క్లబ్ జర్నలిస్టులకు దేవాలయం లాంటిదన్నారు. బాధితుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కార మార్గాలు చూపడంలో ప్రెస్ క్లబ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు, హక్కుల సాధనకోసం యూనియన్లకతీతంగా ఇదే తరహాలో ఐకమత్యంతో పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తి, జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా కోశాధికారి అర్వపల్లి నగేష్‌తో పాటు గెంటెల కుమార్, ఎలుగోటి వెంకట్, కప్పల మధు, నల్ల రాకేష్, జిల్లెల్ల మల్లేష్, షేక్ సోనియా, చిన్నంశెట్టి రాంబాబు, బుర్ర శ్రీనివాస్ కళ్యాణం, ప్రగాని గోపీచంద్, షేక్ నాగుల్ మీరా, వేల్పుల జ్యోతి, శీలం కరుణాకర్ రెడ్డి, గౌరవరపు జగదీష్ శ్రీనివాస్, మొగిలి నాగేశ్వరరావు, దునక శ్రీనివాసరావు, మద్దెల చిన్ని, టి.బిక్షం, నీరుడు రాంబాబు, పాగ యోనా, కొండలరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సభ్యులకు భోజన విందు ఏర్పాటు చేశారు.

# ఆనందోత్సాహాల మధ్య హోలీ వేడుకలు



**వేద న్యూస్, శంకరపట్నం:**

వసంత ఋతువుకు స్వాగతం పలుకుతూ రంగుల పండుగ హోలీని శంకరపట్నం మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో సంబరాల్లో పాల్గొన్నారు. హోలీ పండుగ మతసామరస్యానికి, స్నేహభావానికి ప్రతీకగా నిలుస్తుందని ప్రజలు పేర్కొన్నారు. ఉదయం నుంచే యువత, చిన్నారులు గులాల్ పూసుకుంటూ ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రామాల ప్రధాన వీధులు రంగుల హరివిల్లుల్లా కళకళలాడాయి. పిల్లలు వాటర్ గన్స్‌తో ఆడుతూ, యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కొన్ని గ్రామాల్లో సంఘాల ఆధ్వర్యంలో సామూహిక హోలీ వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి శాంతి భద్రతలను కట్టుదిట్టం చేశారు. పెద్దలు, ప్రజాప్రతినిధులు పరస్పరం రంగులు పూసుకుని ఐక్యతను చాటుతూ హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

వేద న్యూస్

బుధవారం మార్చి 04, 2026

# ప్రమాదాల తగ్గింపే ప్రధాన లక్ష్యం

- రహదారి భద్రత ప్రచారాలు
- ప్రతి ప్రాణం అమూల్యం
- నియమాల అమలులో కఠినత్వం
- అవగాహనలో సానుకూలత
- సురక్షిత ప్రయాణానికి సమాజ భాగస్వామ్యం



**వేద న్యూస్ డెస్క్:**

రహదారి ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక రహదారి భద్రతా ప్రచారాలను ముమ్మరం చేశారు. రోజురోజుకీ పెరుగుతున్న వాహనాల సంఖ్య, వేగవంతమైన జీవనశైలి కారణంగా రహదారులపై ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై కఠిన తనిఖీలతో పాటు ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపడుతున్నారు. ర్యాలీలు, అవగాహన శిబిరాలు, ట్రాఫిక్ సంకేతాల వద్ద ప్రత్యేక ప్రచారాలు నిర్వహిస్తూ వాహనదారులకు భద్రతా సూచనలు అందిస్తున్నారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం వేలాది మంది రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతుండగా, లక్షలాది మంది గాయాలపాలవుతున్నారు.

వేగం మితిమీరడం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ ఉపయోగించడం, ట్రాఫిక్ సంకేతాలను లెక్కచేయకపోవడం వంటి కారణాలు ప్రధానంగా గుర్తించబడ్డాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ విభాగం కఠిన తనిఖీలు నిర్వహిస్తూ ఉల్లంఘనలకు జరిమానాలు విధిస్తోంది. అదే సమయంలో శిక్షలతో మాత్రమే సమస్య పరిష్కారం కాదని గుర్తించి, ప్రజల్లో బాధ్యతాయుత దృక్పథం పెంపొందించేందుకు విద్యా కార్యక్రమాలు కూడా చేపడుతోంది. హెల్మెట్ ధరించడం ద్విచక్ర వాహనదారులకు ప్రాణరక్షక కవచంగా నిలుస్తుంది.

ప్రమాద సమయంలో తలకు తగిలే దెబ్బ తీవ్రతను గణనీయంగా తగ్గించే సామర్థ్యం హెల్మెట్‌కు ఉంది. అలాగే సీట్ బెల్ట్ వినియోగం నాలుగు చక్రాల వాహనదారులను ప్రమాద సమయంలో ముందుకు విసిరివేయకుండా కాపాడుతుంది. చిన్న జాగ్రత్తలే ప్రాణాలను కాపాడగలవన్న సందేశాన్ని అధికారులు స్పష్టంగా తెలియజేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, నివాస కాలనీల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువతలో భద్రతా చైతన్యాన్ని పెంచుతున్నారు.రహదారి భద్రత అనేది కేవలం చట్ట అమలు సంస్థల బాధ్యత కాదు; ప్రతి పౌరుడి బాధ్యత. ట్రాఫిక్ నియమాలను పాటించడం, ఇతర వాహనదారులను గౌరవించడం, పాదచారుల భద్రతను కాపాడడం వంటి చర్యలు సమాజానికి రక్షణ కవచంగా నిలుస్తాయి.

కుటుంబ సభ్యులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలంటే ప్రతి ప్రయాణం ముందు జాగ్రత్త అవసరం. అప్రమత్తత, క్రమశిక్షణ, బాధ్యత అనే విలువలను ఆచరిస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చు. ప్రతి ప్రాణం అమూల్యమనే భావనతో రహదారిపై అడుగులు వేస్తేనే సురక్షిత సమాజం నిర్మాణం సాధ్యమవుతుంది.

ప్రతి సంవత్సరం దేశంలో వేలాది మంది రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. వేగం మితిమీరడం, మద్యం సేవించి వాహనం నడపడం, ట్రాఫిక్ సంకేతాలను పట్టించుకోకపోవడం వంటి కారణాలు ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ విభాగం కఠిన తనిఖీలు నిర్వహిస్తూ నియమావళి ఉల్లంఘనలకు జరిమానాలు విధిస్తోంది. అదే సమయంలో శిక్షలతో పాటు చైతన్య కార్యక్రమాలు కూడా చేపట్టి ప్రజల్లో బాధ్యతాయుత భావన పెంపొందించేందుకు కృషి చేస్తోంది.

హెల్మెట్, సీట్ బెల్ట్ వంటి రక్షణ పరికరాలు చిన్న చర్యలా కనిపించినా, ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడగల కీలక సాధనాలుగా నిలుస్తాయి.



ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ కట్టుకోవడం ద్వారా తీవ్రమైన గాయాల నుంచి తప్పించుకోవచ్చు. ఈ విషయాలపై విద్యాసంస్థలు, కార్యాలయాలు, కాలనీల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రహదారి భద్రత కేవలం ట్రాఫిక్ పోలీసుల బాధ్యత మాత్రమే కాదు; ప్రతి పౌరుడి బాధ్యత. నియమాలను పాటించడం ద్వారా మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడగలం. అప్రమత్తత, క్రమశిక్షణ, బాధ్యత అనే మూడు సూత్రాలను పాటిస్తేనే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు. రహదారిపై ప్రతి అడుగు జాగ్రత్తగా వేస్తేనే సురక్షిత సమాజం సాధ్యమవుతుంది.

ప్రమాద సమయంలో తలకు తగిలే దెబ్బ తీవ్రతను గణనీయంగా తగ్గించే సామర్థ్యం హెల్మెట్‌కు ఉంది. అలాగే సీట్ బెల్ట్ వినియోగం నాలుగు చక్రాల వాహనదారులను ప్రమాద సమయంలో ముందుకు విసిరివేయకుండా కాపాడుతుంది. చిన్న జాగ్రత్తలే ప్రాణాలను కాపాడగలవన్న సందేశాన్ని అధికారులు స్పష్టంగా తెలియజేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, నివాస కాలనీల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువతలో భద్రతా చైతన్యాన్ని పెంచుతున్నారు. పాదచారుల భద్రతను కాపాడడం వంటి చర్యలు సమాజానికి రక్షణ కవచంగా నిలుస్తాయి.

# కామారెడ్డిలో ప్రజాస్వామ్య హక్కులు క్షీణించాయని బీజేపీ ఆరోపణ



- ఎమ్మెల్యేపై దాడి ఘటనపై విమర్శలు పరామర్శకు కూడా స్వేచ్ఛ లేదని ఆరోపణ
- ఎం.ఐ.ఎం కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**వేద న్యూస్ హైదరాబాద్ :**

కామారెడ్డి ప్రాంతంలో ప్రజాస్వామ్య హక్కులు లేకుండా పోయాయని భారతీయ జనతా పార్టీ తెలంగాణ విభాగం ఆరోపించింది. బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణా రెడ్డిపై దాడి జరిగితే, ఆయనను పరామర్శించేందుకు కూడా స్వేచ్ఛ ఇవ్వలేదని విమర్శించింది. హిందూ మహిళలపై దాడులు జరుగుతున్నాయని, వాటిని అడ్డుకునేందుకు నిరసన చేపట్టిన వారిపైనే కేసులు నమోదు చేశారని బీజేపీ నాయకులు ఆరోపించారు. దాడికి పాల్పడిన ఎం.ఐ.ఎం కార్యకర్తలపై తగిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎం.ఐ.ఎం పార్టీకి ప్రోత్సాహం ఇస్తోందని, అందువల్ల వారి కార్యకలాపాలకు అడ్డుకట్ట పడడం లేదని ఆరోపించారు. హిందువులపై, ఆలయాలపై దాడులు కొనసాగుతున్నాయని విమర్శించారు. ఈ వ్యాఖ్యలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బస్సు

**వేద న్యూస్ యాదాద్రి భువనగిరి:**



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపూర్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుండి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనలో దాదాపు పది మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లోని నిడదవోలు నుండి హైదరాబాద్ వైపు బయలుదేరిన బస్సు ప్రమాదానికి గురైంది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు ముప్పై ఆరు మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. లారీ రోడ్డుపక్కన నిలిపివుండగా బస్సు వెనుక నుండి ఢీకొట్టినట్లు ప్రాథమిక సమాచారం తెలిపింది. ప్రమాద శబ్దం విన్న స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన వారిని అంబులెన్సుల ద్వారా సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొందరికి స్వల్ప గాయాలు కాగా, మరికొందరికి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ నిర్లక్ష్యమా లేదా వాహనంలో సాంకేతిక లోపమా అన్న దానిపై విచారణ కొనసాగుతోంది. ఈ ఘటనతో రహదారిపై కొంతసేపు రాకపోకలకు అంతరాయం కలిగింది.

# కేంద్ర విదేశాంగ విధానంపై బీవీ రాఘవులు విమర్శలు

- ఇరాన్‌పై దాడులను ఖండించాలన్న డిమాండ్
- గల్ఫ్ దేశాల్లో భారతీయుల భద్రతపై ఆందోళన
- మార్చి 24న ఢిల్లీలో భారీ నిరసన

**వేద న్యూస్ హైదరాబాద్ :**

కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానంపై సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ వైఖరి దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని ఆరోపించారు. ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులను భారత్ ఖండించకపోవడం దారుణమని మండిపడ్డారు. చర్చల పేరుతో అకస్మాత్తుగా దాడులు చేయడం అనైతికమని వ్యాఖ్యానించారు. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ హయాంలో అనుసరించిన మొండి వైఖరిని ఆయన తప్పుబట్టారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో భేటీల నేపథ్యంలో భారత్ ఈ దాడులకు పరోక్ష మద్దతుఇస్తున్నట్లు కనిపిస్తోందని రాఘవులు ఆరోపించారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న కోట్లాది మంది భారతీయులు, ముఖ్యంగా తెలుగు ప్రజల భద్రతపై కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రష్యా చమురు కొనుగోళ్లు, అమెరికా సుంకాల అంశాల్లో మోదీ ప్రభుత్వం విదేశీ ఒత్తిళ్లకు తలొగ్గుతోందని విమర్శించారు. స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలు ప్రాధాన్యంగా ఉండాలని సూచించారు.ఈ విధానాలకు నిరసనగా మార్చి 24న ఢిల్లీలో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు బి.వి. రాఘవులు ప్రకటించారు. దేశ విదేశాంగ దిశపై ప్రజల్లో చర్చ జరగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.



# జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన సంఘటన దారుణం

- మాజీ మంత్రి లక్ష్మారెడ్డి




**వేద న్యూస్ మహబూబ్ నగర్ :**

జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన సంఘటన దారుణమని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. గతంలో ఎప్పుడూ చూడని విధంగా మార్చురీ గదిలో మృతదేహాన్ని కుక్క పీక్కుతినడం వైద్య అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు.ఆసుపత్రిలో అడుగడుగునా నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు.జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ,వంద పడకల ఆసుపత్రిని,నూతనంగా నిర్మించిన మార్చురీ బిల్డింగును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మార్చురీ గదిలో ఫ్రీజర్లు లేవని, మృతదేహాలను స్ట్రెచర్ పై కాకుండా నేలపై పెట్టడం దురదృష్టకరమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులను పట్టించుకోవడం లేదని వెల్లడించారు. కనీస సౌకర్యాలు కల్పించక హాస్పిటళ్లు దీనావస్థకు చేరుకుంటున్నాయని వివరించారు. వసతులు లేవు. మందులు లేవని దుయ్యబట్టారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హాస్పిటళ్లను అన్ని రకాలుగా అభివృద్ధి చేశామని, కొత్త హాస్పిటల్స్ నిర్మించాం.పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించామని వెల్లడించారు. పాత రోజులు తెస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ నిజం చేసిందన్నారు.కొత్త హాస్పిటల్‌లో 2024 జూన్ లోనే మార్చురీ బిల్డింగ్ కంప్లీట్ అయినా వాడుకోలేదని పేర్కొన్నారు.

# విడాకులు ఇవ్వడం లేదని భార్యపై కత్తితో దాడి



**వేద న్యూస్ హైదరాబాద్ :**

మరో యువతితో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో పాటు విడాకులు ఇవ్వడం లేదన్న కోపంతో భార్యపై కత్తితో దాడిచేసిన భర్తను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నెం 14లోని నందినగర్‌లో నివాసం ఉంటున్న వడ్డెమాన్ నిర్మలకు 2009లో వడ్డెమాన్ అడివన్న (45)తో వివాహం జరిగింది. వారికి ముగ్గురు పిల్లలున్నారు. మూడేళ్లుగా ఊర్మిళ అనే మహిళతో అడివన్న వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. తనకు విడాకులు ఇస్తే ఊర్మిళను పెళ్లి చేసుకుంటానంటూ పలుమార్లు భార్య నిర్మలతో గొడవకు దిగడంతో పాటు తీవ్ర పదజాలంతో దూషిస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 18న నిర్మలతో గొడవపడిన అడివన్న అమెపై విచక్షణారహితంగా దాడికి దిగడంతో పాటు కత్తితో దాడి చేశాడు.బాధితురాలు చికిత్స పొంది ఇటీవలే డిశ్చార్జ్ అయింది. పెద్దలు సముదాయించడంతో నిర్మల కేసు పెట్టలేదు. ఇదిలా ఉండగా రెండ్రోజుల క్రితం మరోసారి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన అడివన్న నిర్మలను దూషించడంతో పాటు కడుపులో తన్నాడు. అంతటితో ఆగకుండా మరోసారి కత్తితో బెదిరిస్తూ నిర్మలతో పాటు ఆమె పిల్లలను చంపేస్తానని బెదిరించాడు. విడాకుల కోసం తన భర్త తనపై కత్తితో దాడి చేశాడని, అతడివల్ల తనకు, తనపిల్లలకు ప్రాణహాని ఉందంటూ బాధితురాలు నిర్మల ఇచ్చిన ఫిర్యాదుతో నిందితుడు అడివన్నపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన బంజారాహిల్స్ పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు

వేద న్యూస్
బుధవారం మార్చి 04, 2026

## ‘జెఫింగ్’ ట్రెండ్: పరుగు మధ్యలో
# నడకతో ఫిట్‌నెస్‌కు కొత్త దారి




**- ఊపిరి తేలికగా స్టామినా ఎక్కువగా - గాయాల ముప్పు తగ్గించే రన్‌వాక్ పద్ధతి**

**వేద న్యూస్ డెస్క్:**

కొద్దిదూరం పరుగెత్తగానే ఊపిరి అందకపోవడం, కండరాల నొప్పులు రావడం చాలా మందికి సహజమే. ఈ సమస్యలకు పరిష్కారంగా ఇప్పుడు ‘జెఫింగ్’ అనే సరికొత్త ఫిట్‌నెస్ విధానం ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతోంది. ఇది పరుగు మధ్యలో నియంత్రిత నడకను కలిపిన శిక్షణ పద్ధతి. దీని వల్ల స్టామినా పెరిగి, అలసట తగ్గి, గాయాల ప్రమాదం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ పద్ధతిని ఒలింపిక్ స్థాయి రన్నర్ జెఫ్ గాలోవే ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. నిర్ణీత సమయం పరుగెత్తి, ఆ తర్వాత కొద్దిసేపు చురుకుగా నడిచి మళ్లీ పరుగు మొదలుపెట్టడం ఈ విధానంలోని ముఖ్యాంశం. పరుగు మొదలుపెట్టిన వెంటనే ఇంటర్వెల్స్ పాటించడం వల్ల శరీరం అధిక ఒత్తిడికి గురికాకుండా క్రమంగా దూరం పెంచుకోవచ్చు. కొత్తగా ప్రారంభించే వారు 30 సెకన్లు పరుగు, 30 సెకన్లు నడకతో మొదలుపెట్టవచ్చు. మధ్యస్థ స్థాయి వారు మూడు నిమిషాల పరుగు తర్వాత ఒక నిమిషం నడకను అనుసరించవచ్చు. నడిచేటప్పుడు పూర్తిగా ఆగిపోకుండా, గుండె వేగం తగ్గకుండా చురుకుగా నడవడం అవసరం. స్నేహితులతో మాట్లాడగలిగేంత వేగంతోనే పరుగు కొనసాగించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఈ పద్ధతి వల్ల కీళ్లు, కండరాలపై ఒత్తిడి తగ్గి, వ్యాయామం తర్వాత వచ్చే నొప్పులు తక్కువగా ఉంటాయి. కేలరీలు సమర్థవంతంగా దహనం అవడంతో బరువు తగ్గడంలో కూడా సహాయపడుతుంది. అనుభవజ్ఞులైన రన్నర్లు సైతం దీని ద్వారా సుదూర రేసులను వేగంగా పూర్తి చేస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. పరుగును భారంగా కాకుండా ఆనందంగా మార్చుకోవడానికి జెఫింగ్ మంచి మార్గమని నిపుణులు అంటున్నారు. ఆరోగ్యంగా ఉండటానికి కేవలం కష్టపడటమే కాదు, తెలివిగా వ్యాయామం చేయడం కూడా ముఖ్యమని ఈ పద్ధతి స్పష్టం చేస్తోంది.

# మెంతులు ఆరోగ్యానికి సహజ వరం

- నానబెట్టిన మెంతులతో శరీరానికి శక్తి - గుండె నుంచి హార్మోన్ల వరకు రక్షణ కవచం

**వేద న్యూస్ డెస్క్:**




మన వంటింట్లో సాధారణంగా పోపు దినుసుగా ఉపయోగించే మెంతులను కేవలం రుచికోసం మాత్రమే కాకుండా ఒక సూపర్ ఆహారంగా పరిగణించాల్సిన అవసరం ఉంది. మెంతుల్లో శరీరానికి అవసరమైన పీచు పదార్థం, ఇనుము, కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ బి6తో పాటు శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి సమగ్ర ఆరోగ్యాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. రాత్రంతా మెంతి గింజలను నీటిలో నానబెట్టి, ఉదయం ఖాళీ కడుపుతో ఆ నీటిని తాగి గింజలను నమలడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం మెంతుల్లోని సాపోనిన్లు, ఫినోలిక్ సమ్మేళనాలు శరీరంలోని వాపును తగ్గించడంలో సహాయపడతాయి. ఈ విధంగా తీసుకోవడం వల్ల పోషకాలు నేరుగా రక్తంలోకి చేరి శరీరానికి త్వరిత ప్రయోజనం అందిస్తాయి. మెంతులు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడతాయి. దీంతో ధమనులలో అడ్డంకులు తగ్గి గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే మెంతి నీరు గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి జీర్ణ సంబంధ సమస్యలను తగ్గిస్తుంది. ప్రేగులను శుభ్రంగా ఉంచి శరీరానికి తేలికను కలిగిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో మెంతులు అద్భుతంగా పనిచేస్తాయి. జీవక్రియను వేగవంతం చేసి ఆకలిని తగ్గించి శరీరంలోని అదనపు కొవ్వును కరిగించడంలో సహాయపడతాయి. మహిళల ఆరోగ్యానికి మెంతులు ప్రత్యేకంగా మేలు చేస్తాయి. హార్మోన్ల సమతుల్యతను కాపాడి క్రమరహిత రుతుక్రమం, థైరాయిడ్, పీసీఓడీ వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఈస్ట్రోజెన్ స్థాయిలను సమతుల్యం చేయడం ద్వారా చర్మం యవ్వనంగా ఉండటానికి, జుట్టు బలంగా పెరగడానికి తోడ్పడతాయి. అయితే ఏ ఆహారాన్నైనా మితంగా తీసుకోవడం ముఖ్యం. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు వైద్యుల సలహాతో మెంతులను ఆహారంలో చేర్చుకోవడం ఉత్తమం.

# నిద్రతోనే రోగనిరోధక శక్తి బలోపేతం

**- సైటోకైన్లు పెరగాలంటే గాఢ నిద్ర అవసరం - టి-కణాల చురుకుదనానికి విశ్రాంతి కీలకం**

**వేద న్యూస్ డెస్క్:**

ఆరోగ్యకరమైన జీవనానికి నిద్ర ఎంతో ముఖ్యమని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా రోగనిరోధక శక్తి బలంగా ఉండాలంటే కంటి నిండా నిద్ర తప్పనిసరి. శరీరంలో సైటోకైన్లు అనే ప్రోటీన్లు వార్తాహరుల్లా పనిచేస్తూ రోగనిరోధక ప్రతిస్పందనను నియంత్రిస్తాయి. ఇంటర్ల్యూకీన్-1, ట్యూమర్ నెక్రోసిస్ ఫ్యాక్టర్ వంటి కొన్ని సైటోకైన్ల స్థాయులు నిద్ర సమయంలో పెరుగుతాయి. ఇవి వాపు ప్రక్రియను నియంత్రించడంలో, ఇన్ఫెక్షన్లతో పోరాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. నిద్రలేమి ఉంటే వీటి ఉత్పత్తి తగ్గిపోవడంతో రోగనిరోధక వ్యవస్థ బలహీనపడే ప్రమాదం ఉంది. తెల్ల రక్తకణాల్లో ముఖ్యమైనవి టి-కణాలు. ఇవి శరీరాన్ని దాడి చేసే వైరస్లు, బ్యాక్టీరియాలను గుర్తించి వాటిని నిర్మూలించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. పరిశోధనల ప్రకారం, గాఢ నిద్ర టి-కణాల చురుకుదనాన్ని పెంచుతుంది. ఇన్ఫెక్షన్‌కు గురైన కణాలను వేగంగా గుర్తించి స్పందించే సామర్థ్యం నిద్రతో మెరుగుపడుతుంది. నిద్రలేమి కారణంగా ఈ ప్రతిస్పందన మందగించి జబ్బులు త్వరగా సోకే అవకాశం ఉంటుంది.



అలాగే యాంటీబాడీలు శరీరాన్ని రోగకారక క్రిముల నుంచి రక్షించే ఆయుధాల్లాంటివి. వీటి సరైన ఉత్పత్తికి కూడా నిద్ర అవసరం. సరిపడా నిద్రపోతే శరీరం భవిష్యత్తులో వచ్చే ఇన్ఫెక్షన్లను ఎదుర్కొనేలా సిద్ధంగా ఉంటుంది. అందుకే రాత్రిళ్లు అర్ధరాత్రి వరకు టీవీ, మొబైల్ వినియోగం తగ్గించి త్వరగా నిద్రపోవడం మంచిది. పెద్దవారికి రోజుకు సాధారణంగా 7 నుంచి 9 గంటల నిద్ర అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. అయితే అతిగా 9-10 గంటలకు మించి నిద్రపోవడం కూడా ఆరోగ్యకరం కాదు. ఎక్కువసేపు పడుకున్నప్పటికీ అలసటగా అనిపిస్తే గాఢనిద్ర లోపించిందనే సూచన కావచ్చు. కాబట్టి సమయానికి నిద్రపోయి, సమయానికి లేవడం అలవాటు చేసుకుంటే రోగనిరోధక శక్తి బలపడటంతో పాటు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

# కంటి నొప్పి: నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమే



**- కంటిదా? మెదడుదా? లక్షణాలు గుర్తించడం ముఖ్యం**
**- ప్రమాద సంకేతాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు అవసరం**

**వేద న్యూస్ డెస్క్:**


కంటి నొప్పి సాధారణంగా అలసట, ఇన్ఫెక్షన్లు, గాయాలు లేదా ఎక్కువసేపు మొబైల్, టీవీ వాడకం వల్ల వస్తుంది. అయితే ఈ నొప్పి కంటికి సంబంధించినదా లేక మెదడుకు సంబంధించినదా అన్నది గుర్తించడం చాలా ముఖ్యం. చాలా మంది దీనిని సాధారణ తలనొప్పిగా భావించి నిర్లక్ష్యం చేస్తారు. కానీ కొన్ని సందర్భాల్లో ఇది తీవ్రమైన సమస్యకు సంకేతం కావచ్చు. ఆరోగ్య నిపుణుల ప్రకారం కంటి నొప్పి ఒక్కటే ఉంటే అది మెదడు సమస్య కావడం చాలా అరుదు. కానీ కంటి నొప్పితో పాటు నుదిటి నుంచి మెడ వరకు తీవ్రమైన తలనొప్పి, తరచూ తల తిరగడం, శరీరంలోని ఏదైనా భాగంలో తిమ్మిరి, పదేపదే వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఇవి మెదడులో వాపు, కణితి వంటి సమస్యలకు సంకేతాలు కావచ్చు. కంటి నొప్పిని నివారించడానికి కొన్ని సాధారణ జాగ్రత్తలు పాటించాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్ష చేయించుకోవడం మంచిది. మొబైల్ ఫోన్, టీవీ వాడకాన్ని పరిమితం చేయాలి. అవసరమైతే సరైన పవర్ ఉన్న కంటి అద్దాలు వాడాలి. విటమిన్ ఏ, సి, ఈ వంటి పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలి. కళ్లకు తగినంత విశ్రాంతి ఇవ్వడం చాలా ముఖ్యం. కంటి నొప్పి చిన్న సమస్యగా కనిపించినా, అది ఎక్కువకాలం కొనసాగితే లేదా తీవ్రమైతే నిర్లక్ష్యం చేయకూడదు. సమయానికి పరీక్షలు చేయించుకుంటే తీవ్రమైన సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స పొందవచ్చు. సరైన జీవనశైలి, కంటి సంరక్షణతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

## శాకాహారులకు ప్రొటీన్
# ఆందోళన అవసరమా?




**వేద న్యూస్ డెస్క్:**

ప్రొటీన్ విషయంలో శాకాహారులు చాలాసార్లు ఆందోళన చెందుతుంటారు. తగినంత ప్రొటీన్ అందడం లేదేమోనని భావించి ప్రొటీన్ పొడులు వాడాలా అనే సందేహం కలుగుతుంది. అయితే నిపుణుల ప్రకారం, ఆహారం ద్వారానే ప్రొటీన్ పొందడం ఉత్తమ మార్గం. సాధారణంగా ప్రతి కిలో శరీర బరువుకు రోజుకు 0.8 గ్రాముల ప్రొటీన్ అవసరం. 50 ఏళ్లు దాటినవారికి ఈ మోతాదు 1.2 గ్రాముల వరకు ఉండాలి. జంతు ఆధారిత ఆహారాల్లో తొమ్మిది అత్యవసర అమైనో ఆమ్లాలు సమృద్ధిగా ఉంటాయి. వీటిని శరీరం సులభంగా గ్రహిస్తుంది. సోయాబీన్స్ మినహా చాలా శాకాహార పదార్థాల్లో ఒకటి లేదా రెండు అమైనో ఆమ్లాలు మాత్రమే ఉంటాయి. అయితే నిరాశ చెందాల్సిన అవసరం లేదు. సరైన ఆహార కలయికలతో పూర్తి అమైనో ఆమ్లాలను పొందవచ్చు. ఉదాహరణకు బియ్యం, గోధుమల వంటి తృణధాన్యాల్లో లైసిన్ తక్కువగా ఉంటుంది. పప్పుదినుసుల్లో మిథియోనిన్ కొరవడుతుంది. కాబట్టి మూడు వంతులు తృణధాన్యాలు, ఒక వంతు పప్పులు కలిపి తీసుకుంటే ఈ లోపాలు భర్తీ అవుతాయి. బియ్యంలో లేని లైసిన్ పప్పుల ద్వారా లభిస్తుంది.



పప్పుల్లో లేని మిథియోనిన్ తృణధాన్యాల నుంచి అందుతుంది. ఈ విధంగా అన్ని అత్యవసర అమైనో ఆమ్లాలు శరీరానికి చేరి ప్రొటీన్ సమృద్ధిగా లభిస్తుంది. మితిమీరిన ప్రొటీన్ పొడుల వినియోగం దీర్ఘకాలంలో దుష్ప్రభావాలకు దారితీయొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధిక మోతాదులో ప్రొటీన్ తీసుకుంటే కిడ్నీలపై భారం పడుతుంది. ప్రొటీన్ జీర్ణమయ్యాక మిగిలే నత్రజనిని బయటకు పంపేందుకు కిడ్నీలు ఎక్కువ పనిచేయాల్సి ఉంటుంది. ఇప్పటికే కిడ్నీ సమస్యలు ఉన్నవారికి ఇది ప్రమాదకరమవుతుంది. కాబట్టి సమతుల్య ఆహారం, సరైన కలయికలతో ప్రొటీన్ అవసరాన్ని తీర్చుకోవడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

వేద న్యూస్
బుధవారం మార్చి 04, 2026

## ‘పెద్ది’పై పుకార్లకు ఫుల్ స్టాప్..!

# వదంతులను నమ్మొద్దన్న చిత్రబృందం



**వేద న్యూస్ డెస్క్:**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం ‘పెద్ది’పై సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లపై చిత్రబృందం స్పష్టత ఇచ్చింది. ముఖ్యంగా సినిమా రన్‌టైమ్‌కు సంబంధించి ప్రచారంలోకి వచ్చిన వదంతులను అభిమానులు నమ్మవద్దని నిర్మాతల తరఫున పబ్లిసిస్ట్ వంశీ శేఖర్ పేర్కొన్నారు. ముందుగా ప్రకటించినట్లే ఏప్రిల్ 30న సినిమాను ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయడానికి అన్ని పనులు వేగంగా సాగుతున్నాయని ఆయన తెలిపారు. వంశీ శేఖర్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ‘పెద్ది’ సినిమా ఫైనల్ రన్‌టైమ్‌పై ఆన్‌లైన్‌లో వస్తున్న వార్తలకు ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం సినిమా ఫస్ట్ హాఫ్ మాత్రమే పూర్తిగా లాక్ అయ్యిందని, సెకండాఫ్‌కు సంబంధించిన షూటింగ్ చివరి దశలో కొనసాగుతోందని తెలిపారు. అదే సమయంలో ఎడిటింగ్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందిస్తున్న నేపథ్య సంగీతం కూడా తుదిదశకు చేరుకుందని వెల్లడించారు. ఇటీవల ఈ సినిమా నుంచి విడుదలైన రామ్ చరణ్ ఇంట్రో సాంగ్ ‘రై రై రా రా’కు అద్భుతమైన స్పందన లభిస్తోంది. మాస్ బీట్‌తో రూపొందిన ఈ పాటకు ఏఆర్ రెహమాన్ స్వయంగా గానం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రామ్ చరణ్ తనదైన ఎనర్జీతో చేసిన డ్యాన్స్ స్టెప్పులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ, అనంత శ్రీరామ్ సాహిత్యం పాటకు మరింత ఉత్సాహాన్ని తీసుకువచ్చాయి. ఉత్తరాంధ్ర గ్రామీణ క్రీడల నేపథ్యంలో రూపొందుతున్న ఈ భారీ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, జగపతి బాబు, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

# ఫ్రీ ప్రచారంపై హీరోయిన్ల దృష్టి





**వేద న్యూస్ డెస్క్:**

సినిమా రంగంలో ప్రచారం అనేది విజయానికి కీలక అంశంగా మారిన ఈ కాలంలో, కొంతమంది హీరోయిన్లు ఉచిత ప్రచారాన్ని సమర్థంగా వినియోగించుకుంటున్నారని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా తాప్సీ పన్ను, మృణాల్ ఠాకూర్ వంటి నటీమణులు ఇటీవలి కాలంలో వివిధ వ్యాఖ్యల ద్వారా నిరంతరం వార్తల్లో నిలుస్తున్నారు. సినిమా విడుదలల ముందు, విడుదల అనంతరం కూడా ఏదో ఒక అంశంపై స్పందిస్తూ ప్రజల దృష్టిని ఆకర్షించడంలో ముందంజలో ఉన్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల ప్రభావం పెరిగిన నేపథ్యంలో, వ్యక్తిగత జీవితం, ప్రేమ, వివాహం వంటి విషయాలపై స్పందించడం కూడా ఒక విధమైన ప్రచార వ్యూహంగా మారిందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా మృణాల్ ఠాకూర్ తన వ్యక్తిగత జీవితంపై వ్యంగ్యంగా, చమత్కారంగా స్పందించడం ద్వారా భారీ స్థాయిలో చర్చకు దారి తీసింది. “ఎప్పుడూ జనాల మధ్య నలుగుతూ ఉండటం కన్నా కావాల్సింది ఏముంది” అనే ఆమె వ్యాఖ్య విస్తృతంగా ప్రచారం పొందింది. ఇక తాప్సీ పన్ను కూడా సామాజిక అంశాలపై స్పష్టమైన అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. వివాదాస్పద విషయాలపైనా ధైర్యంగా స్పందించడం ఆమె ప్రత్యేకతగా మారింది. ఈ తరహా వ్యాఖ్యలు ఒకవైపు అభిమానుల్లో చర్చకు దారి తీస్తుండగా, మరోవైపు సినిమాలకు అదనపు ప్రచారాన్ని అందిస్తున్నాయని పరిశీలకులు అంటున్నారు. ప్రచారం కోసం భారీ ఖర్చులు పెట్టే కాలం ముగిసిపోయి, మాటల ద్వారానే ప్రాచుర్యం పొందే ధోరణి పెరుగుతోందని సినీ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అయితే ఇలాంటి ఉచిత ప్రచారం దీర్ఘకాలిక విజయానికి ఎంతవరకు దోహదపడుతుందనే విషయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కథ, నటన, పాత్ర బలం లేకుండా కేవలం ప్రచారంతోనే నిలదొక్కుకోవడం కష్టమనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. మొత్తానికి, నేటి పరిస్థితుల్లో ప్రచారం కూడా ఒక కళగా మారిపోయిందని, దాన్ని సమర్థంగా వినియోగించుకునే వారే ముందంజలో నిలుస్తారని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# తన జీవితంలోని చేదు జ్ఞాపకం గుర్తుచేసుకున్న నటి స్నేహ

**వేద న్యూస్ డెస్క్:**

తెలుగు సినీ పరిశ్రమలో సాదాసీదా పాత్రలతో, కుటుంబ కథా చిత్రాలతో ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించిన నటి స్నేహ తన జీవితంలో చోటుచేసుకున్న ఒక చేదు ఘటనను తాజాగా గుర్తు చేసుకున్నారు. వెలుగుల ప్రపంచంలో చిరునవ్వులతో కనిపించే నటీనటుల జీవితాల్లోనూ ఎన్నో కఠిన సందర్భాలు ఉంటాయని ఆమె వ్యాఖ్యానించారు. కెరీర్ ప్రారంభ దశలో వరుస అవకాశాలతో ముందుకు సాగుతున్న సమయంలో జరిగిన ప్రమాదం తన జీవితాన్ని పూర్తిగా మార్చేసిందని ఆమె తెలిపారు. ఆ ప్రమాదం ఎలా జరిగిందనే విషయాన్ని వివరించకపోయినా, దాని ప్రభావం ఎంత తీవ్రంగా ఉండిందో ఆమె మాటల్లో స్పష్టమైంది. కాళ్లు, చేతులు, వీపు భాగాల్లో తీవ్రమైన గాయాలు కావడంతో చాలా నెలలు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చిందని స్నేహ చెప్పారు. వైద్యులు కనీసం ఎనిమిది నెలల పాటు మంచం మీదే ఉండాలని సూచించారని, ఆ మాట విన్న క్షణం తన మనసు ముక్కలైపోయిందని ఆమె భావోద్వేగంతో గుర్తుచేసుకున్నారు. అప్పటివరకు కెమెరా ముందు చురుగ్గా తిరిగిన తాను ఒక్కసారిగా మంచానికి పరిమితమవ్వడం చాలా బాధ కలిగించిందని తెలిపారు. ఇకపై సినిమాల్లో నటించడం సాధ్యం కాకపోవచ్చనే భయం వెంటాడిందని చెప్పారు. తాను ఇష్టపడే వృత్తి తనకు దూరమవుతుందనే ఆలోచన ఆమెను మానసికంగా తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు. ఆ సమయంలో కుటుంబ సభ్యులే తనకు ప్రధాన బలమయ్యారని, వారి ధైర్యం లేకపోతే తాను మళ్లీ నిలబడలేకపోయేదాన్నని అన్నారు. అలాంటి క్లిష్ట సమయంలో దర్శకుడు కరు పళనియప్పన్ తనను సంప్రదించారని స్నేహ గుర్తు చేసుకున్నారు. పార్థిబన్ కనవు కథను చెప్పేందుకు వచ్చినప్పుడు తాను ఇంకా పూర్తిగా కోలుకోలేదని తెలిసినా, తనపై నమ్మకం కోల్పోలేదని ఆమె అన్నారు. “మీరు తిరిగి వస్తారు, మీరు చేయగలరు” అనే ఆయన మాటలు తనలో కొత్త ఉత్సాహాన్ని నింపాయని తెలిపారు. ఆ ప్రోత్సాహమే తనకు మానసిక బలాన్ని ఇచ్చిందని స్నేహ స్పష్టం చేశారు. చికిత్సతో పాటు వ్యాయామం, పట్టుదలతో క్రమంగా కోలుకుంటూ మళ్లీ నడవడం ప్రారంభించానని చెప్పారు. మొదటిసారి మళ్లీ మేకప్ వేసుకుని కెమెరా ముందు నిలిచిన రోజు తన జీవితంలో మరువలేని క్షణమని ఆమె పేర్కొన్నారు. ఆ చిత్రం విడుదలై మంచి విజయాన్ని సాధించడంతో తన కెరీర్‌కు కొత్త మలుపు తిరిగిందని చెప్పారు. ఆ ప్రమాదం తనకు ఒక పాఠం నేర్పిందని స్నేహ అన్నారు.



విజయాల సమయం లోనూ వినయం అవసరమని, కష్టకాలంలోనూ ఆశను వదలకూడదని ఆమె అభిప్రాయపడ్డారు. జీవితంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా మనపై మనకు నమ్మకం ఉంటే తిరిగి ఎదగడం సాధ్యమేనని యువతకు సందేశమిచ్చారు. వెలుగుల వెనుక ఉన్న చీకట్లు గుర్తుచేసుకుంటూ, ప్రతి కష్టాన్నీ ధైర్యంగా ఎదుర్కొంటేనే నిజమైన విజయాన్ని అందుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

# వద్దన్న సినిమా బ్లాక్‌బస్టర్



**వేద న్యూస్ డెస్క్:**

దక్షిణాది చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ప్రముఖ నటి ఐశ్వర్య లక్ష్మి గురించి మరో ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విభిన్నమైన పాత్రలు పోషిస్తూ ప్రేక్షకులను అలరించిన ఆమె, కొంతకాలంగా తెరపై తక్కువగా కనిపించడంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ఇదే సమయంలో ఆమె గతంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు మళ్లీ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. తమిళంలో రూపొందిన మట్టి కుస్తీ సినిమా కథను మొదటిసారి వినిపించినప్పుడు తాను అందులో నటించడానికి అంగీకరించలేదని ఆమె వెల్లడించింది. కథలో ద్విపాత్రాభినయం అంశం ఉండటంతో పాటు, తనకు ఆ సమయంలో పాత్రపై స్పష్టత రాకపోవడంతో నిర్మాతలకు తాను ఈ చిత్రం చేయనని స్పష్టంగా చెప్పినట్లు తెలిపింది. ఆ నిర్ణయం వెనుక తన ఆలోచనలే కారణమని, అప్పట్లో ఆ పాత్ర తనకు సరిపోదనిపించిందని పేర్కొంది. అయితే రెండేళ్ల తర్వాత చిత్రబృందం కథలో మార్పులు చేసి మళ్లీ తనను సంప్రదించిందని, ఈసారి కథ వినగానే ఆసక్తి కలిగిందని ఆమె చెప్పింది. పాత్రలో బలం పెరగడంతో పాటు భావోద్వేగాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంతో ఆ ప్రాజెక్ట్‌కి ఒప్పుకున్నట్లు వివరించింది. విడుదలైన తర్వాత ఆ చిత్రం అనూహ్యంగా భారీ విజయాన్ని అందుకోవడం మాత్రమే కాకుండా, ఆమె కెరీర్‌కు కూడా కొత్త ఊపు తీసుకువచ్చింది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించడంతో పాటు తెలుగులోనూ మంచి స్పందన లభించింది. ఈ విజయంతో ఆమెకు వరుస అవకాశాలు వచ్చినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఆమె మట్టి కుస్తీ 2 చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రానికి చెల్లా అయ్యావు దర్శకత్వం వహిస్తుండగా, వెల్స్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది. 2026 వేసవిలో ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఇక తెలుగులోనూ పలు కొత్త కథలను పరిశీలిస్తున్న ఆమె, కథ నచ్చితే ఎలాంటి సవాళ్లనైనా స్వీకరించడానికి సిద్ధమని స్పష్టం చేసింది. ఒకప్పుడు చేయనని ఖరాఖండిగా చెప్పేసిన సినిమానే తన కెరీర్‌లో కీలక మలుపుగా మారిందని ఆమె చెప్పిన మాటలు ఇప్పుడు అభిమానులను మరింత ఆకట్టుకుంటున్నాయి.ఆమె వెల్లడించింది. కథలో ద్విపాత్రాభినయం అంశం ఉండటంతో పాటు, తనకు ఆ సమయంలో పాత్రపై స్పష్టత రాకపోవడంతో నిర్మాతలకు తాను ఈ చిత్రం చేయనని స్పష్టంగా చెప్పినట్లు తెలిపింది. ఆ నిర్ణయం వెనుక తన ఆలోచనలే కారణమని, అప్పట్లో ఆ పాత్ర తనకు సరిపోదనిపించిందని పేర్కొంది. అయితే రెండేళ్ల తర్వాత చిత్రబృందం కథలో మార్పులు చేసి మళ్లీ తనను సంప్రదించిందని, ఈసారి కథ వినగానే ఆసక్తి కలిగిందని ఆమె చెప్పింది. పాత్రలో బలం పెరగడంతో పాటు భావోద్వేగాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంతో ఆ ప్రాజెక్ట్‌కి ఒప్పుకున్నట్లు వివరించింది. ఈ విజయంతో ఆమెకు వరుస అవకాశాలు వచ్చినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఆమె మట్టి కుస్తీ 2 చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రానికి చెల్లా అయ్యావు దర్శకత్వం వహిస్తుండగా, వెల్స్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది. 2026 వేసవిలో ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఇక తెలుగులోనూ పలు కొత్త కథలను పరిశీలిస్తున్న ఆమె, కథ నచ్చితే ఎలాంటి సవాళ్లనైనా స్వీకరించడానికి సిద్ధమని స్పష్టం చేసింది.

## లావణ్య త్రిపాఠి ‘సతీ లీలావతి’ వాయిదా..




**వేద న్యూస్ డెస్క్:**

మెగా కోడలు లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం ‘సతీ లీలావతి’ విడుదల వాయిదా పడింది. మలయాళ నటుడు దేవ్ మోహన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే చివరి దశకు చేరుకుంది. మొదటగా ఈ చిత్రాన్ని మార్చి 6న విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించారు. అయితే విడుదలకు సమీపిస్తున్న సమయంలో కొన్ని అనూహ్య పరిణామాలు చోటుచేసుకోవడంతో విడుదలను వాయిదా వేయాల్సి వచ్చిందని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాతలు వెల్లడించారు. చిత్రబృందం విడుదల చేసిన ప్రకటనలో సాంకేతిక కారణాల వల్ల నిర్ణయించిన తేదీన సినిమా విడుదల చేయడం సాధ్యంకాలేదని, ప్రేక్షకుల అంచనాలకు అనుగుణంగా ఎలాంటి రాజీ లేకుండా చిత్రాన్ని సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. క్వాలిటీ విషయంలో రాజీ పడకుండా మరింత మెరుగైన రూపంలో సినిమాను తీసుకురావాలని భావిస్తున్నట్లు తెలిపారు.

## ఓటీటీలోకి ‘విత్ లవ్’.. స్ట్రీమింగ్ ఎక్కడంటే..?




**వేద న్యూస్ డెస్క్:**

ఇటీవల థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకున్న క్యూట్ రొమాంటిక్ కామెడీ చిత్రం ‘విత్ లవ్’ ఇప్పుడు ఓటీటీ వేదికలోకి రాబోతోంది. థియేటర్లలో మంచి స్పందన అందుకున్న ఈ సినిమా డిజిటల్ రిలీజ్ కోసం ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు చిత్ర బృందం శుభవార్త తెలిపింది. ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు సొంతం చేసుకుంది. ఈ సినిమా మార్చి 6 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుందని మేకర్స్ ప్రకటించారు. తమిళంతో పాటు తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో కూడా ఈ సినిమా అందుబాటులోకి రానుంది. ‘టూరిస్ట్ ఫ్యామిలీ’ చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు పొందిన అభిషన్ జీవింత్ ఈ సినిమాతో హీరోగా వెండితెరకు పరిచయం అయ్యాడు. ఆయన సరసన మలయాళ నటి అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటించి ప్రేక్షకులను మెప్పించింది. ఈ చిత్రానికి మదన్ దర్శకత్వం వహించారు. బ్లైండ్ డేట్‌లో కలిసిన సత్య, మనీషా అనే ఇద్దరు యువకులు ఒకే స్కూల్‌లో చదివినట్లు తెలుసుకోవడం, ఆ తర్వాత వారి స్కూల్ రోజుల జ్ఞాపకాలు, అప్పటి క్రష్‌లు, స్నేహాలు గుర్తు చేసుకుంటూ సాగిన కథ ప్రేక్షకులకు మంచి అనుభూతిని కలిగించింది.

వేద న్యూస్

బుధవారం మార్చి 04, 2026

# సెమీస్‌లో టీమిండియా కానీ కెప్టెన్ రికార్డు ఆందోళన..!

## సూర్య ఫామ్‌పై చర్చ

**వేద న్యూస్ డెస్క్:**

టీ20 ప్రపంచకప్ 2026లో భారత జట్టు అద్భుత ప్రదర్శనతో సెమీఫైనల్‌కు చేరుకున్నప్పటికీ, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్‌పై క్రికెట్ వర్గాల్లో చర్చ మొదలైంది. ఇంగ్లండ్‌తో కీలక సెమీస్ పోరుకు ముందు సూర్యకుమార్ ప్రపంచకప్ గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయని భారత మాజీ క్రికెటర్, ప్రముఖ వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రా వ్యాఖ్యానించారు. ముఖ్యంగా బలమైన జట్లపై సూర్యకుమార్ ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదని ఆయన విశ్లేషించారు. ఆకాశ్ చోప్రా వెల్లడించిన వివరాల ప్రకారం సూర్యకుమార్ ఇప్పటివరకు ఐదు ప్రపంచకప్ టోర్నీల్లో ఆడినప్పటికీ, బలమైన జట్లపై కేవలం రెండు అర్ధశతకాలే నమోదు చేశాడు. ఒకటి దక్షిణాఫ్రికాపై పెర్త్‌లో నమోదు కాగా, మరొకటి గత ప్రపంచకప్‌లో ఆఫ్ఘనిస్తాన్‌పై సాధించాడు. ఈ స్థాయి ప్రతిభ కలిగిన ఆటగాడికి ఇది తక్కువ గణాంకమేనని చోప్రా అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా పెద్ద మ్యాచ్‌ల్లో అతని బ్యాటింగ్ మరింత ప్రభావం చూపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాడు. ప్రస్తుత టీ20 ప్రపంచకప్‌లో సూర్యకుమార్ మొత్తం 7 మ్యాచ్‌ల్లో 231 పరుగులు చేశాడు. టోర్నమెంట్ ప్రారంభ దశలో అమెరికాపై 49 బంతుల్లో 84 పరుగులు చేసి జట్టుకు కీలక విజయాన్ని అందించాడు. అయితే ఆ తర్వాత మ్యాచ్‌ల్లో పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. అర్ధశతకం నమోదు చేయకపోవడంతో పాటు అతని స్ట్రైక్ రేట్ కూడా కొంత తగ్గిందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్‌తో జరగనున్న సెమీఫైనల్ మ్యాచ్‌కు ముందు సూర్య ఫామ్ జట్టుకు కీలక అంశంగా మారింది. నాకౌట్ మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గా ముందుండి జట్టును నడిపించాల్సిన బాధ్యత అతనిపై ఉంది. ముఖ్యంగా ఇంగ్లండ్ వంటి బలమైన జట్టుపై మంచి ఇన్నింగ్స్ ఆడితేనే జట్టు ఫైనల్‌కు చేరే అవకాశాలు మరింత బలపడతాయని క్రికెట్ నిపుణులు అంటున్నారు. భారత్ మూడోసారి టీ20 ప్రపంచకప్ టైటిల్ గెలవాలనే లక్ష్యంతో




బరిలోకి దిగింది. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇంకా రెండు విజయాలు మాత్రమే కావాలి. ఈ కీలక సమయంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన అసలైన ఫామ్ చూపిస్తాడా అనే ప్రశ్న అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇంగ్లండ్‌తో సెమీస్ మ్యాచ్‌లో అతని ప్రదర్శనపై ఇప్పుడు అందరి దృష్టి నిలిచింది.

# భారత్ ఇంగ్లండ్ సెమీస్‌కు వర్షం ముప్పు...

## మ్యాచ్ రద్దయితే టీమిండియా అవుట్!




**వేద న్యూస్ డెస్క్:**

టీ20 ప్రపంచకప్ 2026 కీలక దశకు చేరుకుంది. ఎల్లుండి ముంబైలోని వాంఖడే స్టేడియంలో భారత్, ఇంగ్లండ్ మధ్య సెమీ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. అయితే ఈ కీలక పోరుకు వర్షం ముప్పు పొంచి ఉండటం అభిమానుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఒకవేళ మ్యాచ్ వర్షం కారణంగా పూర్తిగా రద్దయితే టీమిండియా ఫైనల్ అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఐసీసీ నిబంధనల ప్రకారం సెమీ ఫైనల్ మ్యాచ్‌కు ఒక రోజు రిజర్వ్ డే ఉంటుంది. గురువారం మ్యాచ్ జరగకపోతే శుక్రవారం రిజర్వ్ డేలో ఆట నిర్వహిస్తారు. మ్యాచ్ రోజున అదనంగా 90 నిమిషాలు, రిజర్వ్ డే రోజున 120 నిమిషాల అదనపు సమయం ఇవ్వబడుతుంది. కనీసం 5 ఓవర్ల మ్యాచ్ అయినా నిర్వహించేందుకు అధికారులు ప్రయత్నిస్తారు. అయితే వర్షం కారణంగా మ్యాచ్ పూర్తిగా జరగకపోతే సూపర్ 8 దశలో గ్రూప్ పాయింట్ల ఆధారంగా ఫైనల్‌కు అర్హత నిర్ణయిస్తారు. ఈ పరిస్థితి భారత్‌కు ప్రతికూలంగా మారనుంది. సూపర్ 8లో ఇంగ్లండ్ తమ గ్రూప్‌లో మూడు మ్యాచ్‌లను గెలిచి టాప్‌లో నిలిచింది. మరోవైపు భారత్ రెండు విజయాలతో తమ గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచింది. దీంతో మ్యాచ్ పూర్తిగా రద్దయితే ఇంగ్లండ్ జట్టే ఫైనల్‌కు చేరుతుంది. ఇక మరో సెమీ ఫైనల్‌లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్లు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో తలపడనున్నాయి. ఒకవేళ రెండు సెమీ ఫైనల్స్ కూడా వర్షం కారణంగా రద్దయితే దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ జట్లు ఫైనల్‌లో తలపడే అవకాశం ఉంది. గత రెండు టీ20 ప్రపంచకప్‌లలో భారత్‌ఇంగ్లండ్ సెమీ ఫైనల్ పోరు ప్రత్యేకంగా నిలిచింది. 2022లో జరిగిన సెమీస్‌లో భారత్ ఓటమి పాలవగా, ఆ టోర్నీలో ఇంగ్లండ్ టైటిల్ గెలిచింది. 2024లో మాత్రం భారత్ సెమీస్‌లో ఇంగ్లండ్‌పై గెలిచి చివరికి ట్రోఫీని కైవసం చేసుకుంది. దీంతో ఈసారి జరగబోయే సెమీస్‌పై అభిమానుల్లో మరింత ఉత్కంఠ నెలకొంది.

# టీ20 ప్రపంచకప్ సెమీస్‌కు అంపైర్లు ఖరారు



**వేద న్యూస్ డెస్క్:**

ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ కీలక దశకు చేరుకోగా, సెమీ ఫైనల్ మ్యాచ్‌ల కోసం అంతర్జాతీయ క్రికెట్ మండలి అంపైర్లు, అధికారుల జాబితాను ప్రకటించింది. ఈ ఎలైట్ ప్యానెల్‌లో ఇద్దరు భారతీయులకు చోటు దక్కడం విశేషం. భారత అంపైర్ నితిన్ మెనన్‌తో పాటు మాజీ భారత క్రికెటర్ జవగళ్ శ్రీనాథ్ కీలక బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ నెల 5న ముంబైలోని వాంఖడే స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, ఇంగ్లండ్ మధ్య జరిగే రెండో సెమీ ఫైనల్ మ్యాచ్‌కు క్రిస్ గఫానీ, అల్లావుద్దీన్ పాలేకర్ ఆన్‌ఫీల్డ్ అంపైర్లుగా వ్యవహరించనున్నారు. ఈ మ్యాచ్‌కు ఏడ్రియన్ హోల్డ్‌స్టాక్ థర్డ్ అంపైర్‌గా, పాల్ రీఫిల్ ఫోర్త్ అంపైర్‌గా పనిచేస్తారు. మ్యాచ్ రిఫరీగా ఆండీ పైక్రాఫ్ట్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. కాగా, మార్చి 4న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య తొలి సెమీ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌కు రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, అలెక్స్ వార్ఫ్ ఆన్‌ఫీల్డ్ అంపైర్లుగా వ్యవహరిస్తారు. భారత అంపైర్ నితిన్ మెనన్ ఈ మ్యాచ్‌లో థర్డ్ అంపైర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఫోర్త్ అంపైర్‌గా రాడ్ టక్కర్ ఉండగా, మ్యాచ్ రిఫరీగా మరో భారతీయుడు జవగళ్ శ్రీనాథ్ సేవలందించనున్నారు. గతంలో కూడా కీలక మ్యాచ్‌లకు అంపైరింగ్ చేసిన అనుభవం ఉన్న అధికారులనే ఐసీసీ ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 2024లో భారత్ గెలిచిన సెమీ ఫైనల్ మ్యాచ్‌కు కూడా క్రిస్ గఫానీ అంపైర్‌గా వ్యవహరించడం గమనార్హం. దీంతో రాబోయే సెమీ ఫైనల్ పోరులు మరింత ఉత్కంఠభరితంగా మారనున్నాయి.

# జరిమానాలు కాదు.. వ్యవస్థనే మార్చండి

## అఫ్రిది ఆగ్రహం



**వేద న్యూస్ డెస్క్:**

ఇరవై ఓవర్ల ప్రపంచకప్ 2026లో పాకిస్థాన్ జట్టు ప్రస్థానం నిరాశాజనకంగా ముగియడంతో ఆ దేశ క్రికెట్ వర్గాల్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం సెమీఫైనల్‌కు చేరుతుందనే అంచనాల మధ్య బరిలోకి దిగిన జట్టు సూపర్ 8 దశలోనే నిష్క్రమించడంతో అభిమానుల్లో ఆగ్రహం పెరిగింది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. జట్టులోని ప్రతి ఆటగాడికి రూ.50 లక్షల వరకు జరిమానా విధించే ఆలోచనలో బోర్డు ఉందని వార్తలు వస్తున్నాయి. అధికారిక ప్రకటన వెలువడకపోయినా, ఈ నిర్ణయం పాక్ క్రికెట్ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ముఖ్యంగా భారత్ చేతిలో ఎదురైన ఓటమి, కీలక మ్యాచ్‌ల్లో తడబాటు ఈ చర్యలకు కారణమని భావిస్తున్నా గ్రూప్ దశలో చిన్న జట్లపై విజయాలు సాధించినప్పటికీ, బలమైన జట్లను ఎదుర్కొనే సమయంలో పాకిస్థాన్ జట్టు స్థిరత్వం చూపలేకపోయింది. సూపర్ 8 దశలో ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దవ్వడం, మరో మ్యాచ్‌లో ఓటమి చవిచూడడం జట్టు అవకాశాలను దెబ్బతీశాయి. మొత్తం టోర్నీలో జట్టు సమన్వయం లోపించడం, మధ్యవరుస విఫలం కావడం, బౌలింగ్ విభాగంలో ఒత్తిడి పెరగడం వంటి అంశాలు వైఫల్యానికి దారితీశాయి. ఈ కఠిన నిర్ణయంపై పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది తీవ్రంగా స్పందించారు. జరిమానాలు విధించడం వల్ల ఆటగాళ్ల ప్రదర్శన మెరుగుపడదని, ఇది చాలా సంకుచితమైన ఆలోచన అని మండిపడ్డారు. కేవలం డబ్బులు వసూలు చేయడం సరిపోదని, అసలు లోపం క్రికెట్ వ్యవస్థలోనే ఉందని ఆయన వ్యాఖ్యానించారు. భావిస్తున్నట్లు సమాచారం. జట్టులోని ప్రతి ఆటగాడికి రూ.50 లక్షల వరకు జరిమానా విధించే ఆలోచనలో బోర్డు ఉందని వార్తలు వస్తున్నాయి. క్రికెట్ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది.

# నబీ ఎంపికపై తుది మాట సెలెక్టర్లదే




**వేద న్యూస్ డెస్క్:**

రంజీ ట్రోఫీలో జమ్ము కశ్మీర్ తరఫున అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించిన ఆకిబ్ నబీ జాతీయ జట్టులోకి ఎంపిక అవుతాడా అనే చర్చ క్రికెట్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి కార్యదర్శి దేవజిత్ సైకియా కీలక వ్యాఖ్యలు చేశారు. నబీ రంజీ ట్రోఫీలో అత్యుత్తమ ప్రదర్శన చేసి జమ్ము కశ్మీర్ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జరిగిన ప్రతి మ్యాచ్‌కు జాతీయ ఎంపికదారులు హాజరై ప్రతిభావంతులను గమనించారని తెలిపారు. అయితే జాతీయ జట్టులోకి ఎంపిక చేయాలా వద్దా అన్నది పూర్తిగా ఎంపికదారుల పరిధిలోని విషయమని స్పష్టం చేశారు. మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన ఆటగాళ్లకు అవకాశాలు దక్కుతున్నాయంటే భారత క్రికెట్ నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన వ్యవస్థ ఫలితమేనని సైకియా పేర్కొన్నారు. అయితే నబీ ప్రతిభను గుర్తించి ఈ స్థాయికి తీసుకొచ్చింది జమ్ము కశ్మీర్ రాష్ట్ర ఎంపికదారులేనని, దేశీయ క్రికెట్‌లో మెరుగైన ప్రదర్శన చేస్తే జాతీయ ఎంపికదారులు తప్పకుండా గమనిస్తారని తెలిపారు. ఈ సీజన్ రంజీ ట్రోఫీ లో నబీ 10 మ్యాచ్‌లు ఆడి 60 వికెట్లు పడగొట్టి టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ఏడు సార్లు ఐదు వికెట్లు సాధించి తన ప్రతిభను చాటుకున్నాడు. ప్రధాన పాత్ర పోషించాడు.

# జాతీయ గీతానికి మౌన నిరసన..

## – అంతర్జాతీయ వేదికపై ఇరాన్ మహిళల జట్టు సంచలనం

**వేద న్యూస్ డెస్క్:**



అంతర్జాతీయ క్రీడా వేదికపై అరుదైన సంఘటన చోటు చేసుకుంది. మహిళల ఆసియా కప్ ప్రారంభ మ్యాచ్‌కు ముందు జాతీయ గీతం ఆలపించే వేళ ఇరాన్ మహిళల ఫుట్‌బాల్ జట్టు ఆటగాళ్లు మౌనంగా నిలబడి నిరసన తెలిపారు. ఈ చర్య ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాం శమైంది. ఇటీవల అమెరికా దాడుల్లో మరణించినట్లు ప్రకటించిన ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ మృతికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. ఆస్ట్రేలియాలోని గోల్డ్ కోస్ట్ వేదికగా దక్షిణ కొరియాతో జరిగిన ఈ మ్యాచ్‌కు ముందు రెండు జట్లు మైదానంలో వరుసగా నిలబడ్డాయి. సాధారణంగా ప్రతి అంతర్జాతీయ మ్యాచ్‌కు ముందు ఆయా దేశాల జాతీయ గీతాలు ప్రసారం చేయడం ఆనవాయితీ. అయితే ఇరాన్ జాతీయ గీతం వినిపిస్తున్న సమయంలో జట్టు సభ్యులు ఒక్కరూ గీతాన్ని ఆలపించలేదు. వారు గంభీరంగా, ఎటువంటి హావభావాలు లేకుండా నిలబడి తమ మౌన నిరసనను వ్యక్తం చేశారు. ప్రధాన కోచ్ మార్జియే జాఫరీ కూడా ఆటగాళ్లతో పాటు నిలబడి గీతాన్ని ఆలపించకపోవడం గమనార్హం. ఈ ఘటనతో స్టేడియంలో ఉన్న ప్రేక్షకులు, క్రీడాభిమానులు ఆశ్చర్యానికి గుర య్యారు. సామాజిక మాధ్యమాల్లో ఈ దృశ్యాలు విస్తృతంగా ప్రచారం అయ్యాయి. కొందరు ఆటగాళ్ల ధైర్యాన్ని ప్రశంసిస్తుండగా, మరికొందరు క్రీడలను రాజకీయాలతో ముడిపెట్టకూడదని అభిప్రాయ పడ్డారు. ఈ నేపథ్యంలో ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్య ప్రతినిధులు పరిస్థితిని సమీక్షించినట్లు సమాచారం. మ్యాచ్ అనంతరం జరిగిన మీడియా సమావేశంలో జట్టు కెప్టెన్ జహ్రా ఘన్బారి, కోచ్ జాఫరీలను ఖమేనీ మరణం గురించి ప్రశ్నించగా, సమాఖ్య ప్రతినిధి జోక్యం చేసుకుని ఆ ప్రశ్నలను నిలిపివేయాలని సూచించారు. ఆటపై మాత్రమే దృష్టి సారించాలని పేర్కొన్నారు. దీనితో ఈ ఘటనపై అధికారిక వ్యాఖ్యలు ఎక్కువగా వెలువడలేదు. మ్యాచ్ పరంగా చూస్తే, ఆసియాలో బలమైన జట్లలో ఒకటైన దక్షిణ కొరియా ఆధిపత్యం చాటుకుంది. తొలి అర్ధభాగంలో చో యు–రి గోల్ సాధించి జట్టుకు ఆధిక్యం తీసుకువచ్చింది. విరామం తర్వాత కిమ్ హ్యేరి, కో యో జిన్ మరో రెండు గోల్స్ చేసి దక్షిణ కొరియాకు స్పష్టమైన విజయాన్ని అందించారు. ఇరాన్ జట్టు రక్షణలో కొంత బలహీనత కనిపించగా, దాడి విభాగంలో ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం రాలేదు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073